


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 244, పేజీలు - 08

గురువారం, ఫిబ్రవరి 19, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# నేషనల్ పార్క్ భూమిపై భూ మాఫియా కన్నేసిందా.?

**- కుంట్లూర్ రక్షిత అటవీ ప్రాంతంలో 5.30 ఎకరాల అక్రమ నమోదు**
**- పట్టాదారు, అవినీతి అధికారులపై చర్యలకు డిమాండ్**




చామా ప్రతాప్ రెడ్డి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కుంట్లూర్ గ్రామంలోని రక్షిత అటవీ ప్రాంతం (రిజర్వ్ ఫారెస్ట్), మహావీర్ హరినా వనస్థలి జాతీయ వనానికి (నేషనల్ పార్క్) చెందిన నోటిఫైడ్ అటవీ భూమి రెవెన్యూ రికార్డుల్లో అక్రమంగా ఒక వ్యక్తి పేరున నమోదు కావడం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంపై తెలంగాణ అటవీ శాఖ జిల్లా కలెక్టరుకు అధికారిక నివేదిక సమర్పించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది.

## 1975లో ప్రకటన... 1994లో జాతీయ వనంలో చేర్పు

**అటవీ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం:**

- ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 770 : 24-10-1975 నాటి ఉత్తర్వుల ప్రకారం ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం-1967, సెక్షన్ 15 కింద కుంట్లూర్ రక్షిత అటవీ ప్రాంతం మొత్తం 532.03 ఎకరాల విస్తీర్ణంలో ప్రకటించబడింది.
- రాజపత్రం : దీనికి సంబంధించిన అధికారిక రాజపత్రం 13-11-1975న విడుదలైంది.

- జాతీయ వనం : అనంతరం 05-10-1994 నాటి ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 208 ద్వారా ఈ ప్రాంతాన్ని మహావీర్ హరినా వనస్థలి జాతీయ వనంలో భాగంగా చేర్చారు.

అటవీ సెటిల్మెంట్ ప్రక్రియ సమయంలో కేవలం 42 ఎకరాలు మాత్రమే ప్రైవేటు వ్యక్తులకు మినహాయింపు (డీ-రిజర్వ్) ఇచ్చారు. మిగిలిన 532.03 ఎకరాలు పూర్తిస్థాయిలో రక్షిత అటవీ భూమిగా ఖరారై, 1998-99 వరకు రెవెన్యూ రికార్డుల్లో అలాగే ఉంది.

## 1999-2000 పహానీ రికార్డుల్లో తిరకాసు.?

1999-2000 సంవత్సరంలో పహానీ నమోదు వివరాల్లో అక్రమ మార్పులు జరిగినట్లు అటవీ శాఖ గుర్తించింది. కుంట్లూర్ గ్రామం సర్వే నంబరు 273/2లోని 5.30 ఎకరాల భూమిని శ్రీ చామా ప్రతాప్ రెడ్డి పేరున నమోదు చేశారు. కానీ, ఈ భూమి రక్షిత అటవీ ప్రాంతం మరియు జాతీయ వన పరిధిలోకి వస్తుందని అధికారులు స్పష్టం


తహసీల్దార్ వేంకటేశ్వర్లు


చేస్తున్నారు. ఎటువంటి చట్టబద్ధమైన పట్టా లేదా మినహాయింపు ఉత్తర్వులు లేకుండానే ఈ నమోదు జరగడం గమనార్హం.

## ధరణిలో 4 ఎకరాల మాయం!

ధరణి అంతర్జాల పోర్టల్‌లో పొందుపరిచిన భూ సమగ్ర వివరాల ప్రకారం , కుంట్లూర్ రక్షిత అటవీ విస్తీర్ణం 528.03 ఎకరాలుగా చూపిస్తోంది. కానీ రాజపత్రం ప్రకారం ఉండాల్సింది 532.03 ఎకరాలు. అంటే 4 ఎకరాల భూమి చట్టవిరుద్ధంగా తగ్గించబడింది. ఈ తగ్గింపుకు ఎటువంటి శాసనసభ తీర్మానం లేదా చట్టబద్ధమైన ప్రక్రియ అనుసరించలేదని అటవీ శాఖ తేల్చి చెప్పింది.

## చట్టం ఏం చెబుతోంది.?

- వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972 : సెక్షన్ 35(5) ప్రకారం జాతీయ వనం సరిహద్దులను రాష్ట్ర శాసనసభ


GOVERNMENT OF TELANGANA
FOREST DEPARTMENT

From:
Sri Rohith Gopidi, I.F.S.,
District Forest Officer,
Rangareddy.

To:
The District Collector,
Rangareddy.

Rc.No. 3068709/2025/56, Dt: .10-02-2026

Sir,

Sub: Forest Department - Rangareddy District - Kuntloor Village - Kuntloor Reserve Forest / Mahavir Harina Vanasthali National Park - Wrongful inclusion of forest land in revenue records in the name of Sri Chama Prathap Reddy to an extent of Ac.05.30 guntas in Sy.No.273/2 - Request to instruct the concerned Revenue authorities for rectification of records and restoration of notified forest land - Reg.

Ref: 1. G.O.Ms.No.770, F&RD Department, dated 24.10.1975.
2. G.O.Ms.No.208, EFS&T (For.III) Department, dated 05.10.1994.
3. FRO, Hayathnagar, Rc.No.1/HYT/2024-25, dated 19.05.2025, 30.05.2025, 07.07.2025 & 04.02.2026
4. Tahsildar, Hayathnagar Lr.No.C/1055/2015, dated 24.11.2016.
5. RDO, Ibrahimpatnam Lr.No.B/1700/2025, dt. 22.08.2025 & 26.09.2025.

*****

It is submitted that Kuntloor Reserve Forest was notified under Section 15 of the Andhra Pradesh Forest Act, 1967 vide reference 1st cited, to an extent of Ac.532.03 guntas, as published in the Gazette Notification dated 13.11.1975. Subsequently, the said Reserve Forest was included as part of Mahavir Harina Vanasthali National Park vide G.O. 2nd cited.

At the time of notification of the Reserve Forest, an extent of Ac.42.00 guntas was dis-reserved in favour of private individuals after settlement of claims by the Forest Settlement Officer. The remaining extent of Ac.532.03 guntas stands finally notified as Kuntloor Reserve Forest, which is also reflected in the Gazette notifications and revenue records up to the year 1998-99.

However, during the year 1999-2000, it was observed that Pahani entries were tampered, and an extent of Ac.05.30 guntas in Sy.No.273/2 of Kuntloor Village was shown in the name of Sri Chama Prathap Reddy, though the said land forms part of the notified Reserve Forest and National Park. The incorrect entry has continued to persist in the revenue records despite repeated reports and correspondence by the Forest Department, as brought out in the references cited.

Further, as per the Land Reconciliation Statements uploaded in Dharani Portal, the extent of Kuntloor Reserve Forest is shown as Ac.528.03 guntas, instead of the notified extent of Ac.532.03 guntas. The reduction of Ac.04.00 guntas is not supported by any statutory notification or lawful proceedings.

తీర్మానం లేకుండా మార్చకూడదు.

- శిక్షలు : సెక్షన్ 51, 52 ప్రకారం అనధికార ఆక్రమణలు కఠిన శిక్షార్హం.
- అటవీ సంరక్షణ చట్టం, 1980: సెక్షన్ 2 ప్రకారం కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా అటవీ భూమిని ఇతర అవసరాలకు మళ్లించడం నేరం.

## ఎవరి ప్రమేయం ఉంది.?

పట్టా హక్కులు లేకపోయినా అటవీ భూమిని వ్యక్తి పేరున మార్చడం


తెలంగాణ ప్రభుత్వము
పట్టాదారు పాసు పుస్తకం
భూమి యాజమాన్య హక్కు పత్రం
True Copy

జిల్లా : రంగా రెడ్డి
డివిజన్: ఇబ్రహీంపట్నం
మండలం: అబ్దుల్లాపూర్మెట్
గ్రామం: కుంట్లూర్
పాస్ బుక్ టైప్ : Individual
పాస్ బుక్ నెం. : T05010160084
ఖాతా నెం. : 471

1. పట్టాదారు పేరు ఇంటిపేరుతో : చామ ప్రతాప్ రెడ్డి
2. తండ్రి / భర్త పేరు : చామ యాదగిరి రెడ్డి
3. స్త్రీ / పురుషుడు : Female
4. చిరునామా : కుంట్లూర్
5. కులము : General
6. ఆధార్ / పాస్ పోర్ట్ / CIN సంఖ్య : XXXXXXXX0884
7. పట్టాదారు సంతకం ఎడమ / కుడి చేతి వేలిముద్ర

01
తహశీల్దార్ సంతకం

పట్టాదారు పాస్ బుక్

వెనుక రెవెన్యూ అధికారుల హస్తం ఉందా? పహానీ, ధరణి రికార్డుల్లో మార్పులకు ఆదేశాలు ఇచ్చింది ఎవరు? ఈ అక్రమ నమోదు వెనుక భూ మాఫియా ప్రమేయం ఉందా? అన్నవి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి. అటవీ భూమిని ఆక్రమించిన పట్టాదారుపై తక్షణమే నేర విచారణ చేపట్టాలి. అక్రమంగా రికార్డులు మార్చిన రెవెన్యూ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. రికార్డులను సవరించి 532.03 ఎకరాల అటవీ భూమిని తిరిగి అటవీ శాఖకు అప్పగించాలి సామాజిక కార్యకర్త కళ్ళెం వెంకట్ రెడ్డి, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల


**- మొత్తం 37 స్థానాలకు మార్చి 16న ఎన్నికలు**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రాజ్యసభ ఎన్నికలకు నగారా మోగింది. త్వరలో ఖాళీ కానున్న రాజ్యసభ స్థానాలకు షెడ్యూల్ బుధవారం విడుదల అయింది. తెలంగాణ నుంచి 2 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 10 రాష్ట్రాల్లో ఖాళీ కాబోతున్న రాజ్యసభ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 26న ఈ రాజ్యసభ ఖాళీ కానున్న స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 16న పోలింగ్ నిర్వహించనున్నట్లు భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. పది రాష్ట్రాల్లో మొత్తం 37 రాజ్యసభ ఎంపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రక్రియ మొదలైంది. ఏప్రిల్ 9కి తెలంగాణ నుంచి కేఆర్ సురేశ్‌రెడ్డి, అభిషేక్ సింఘ్వీల రాజ్యసభ పదవీ కాలం పూర్తికానుంది. తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో అయిదుగురు, బిహార్‌లో అయిదుగురు, ఒడిశాలో నలుగురు, అస్సాంలో ముగ్గురు, చత్తీస్‌ఘడ్, హర్యానాల్లో ఇద్దరేసి, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక రాజ్యసభ సీటు ఖాళీ కాబోతున్నాయి. రాజ్యసభ నిరంతర సభ కాగా, అందులో 37 మంది సభ్యుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగియనుందని తెలిసిందే. ఈ ఖాళీల భర్తీకి సంబంధించి ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి 26న ఈసీ విడుదల చేయనుంది. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. మార్చి 9వ వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకునే వీలుంటుంది. షెడ్యూల్ ప్రకారం మార్చి 16వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ప్రక్రియ విజేతను ప్రకటిస్తారు.

# హైదరాబాద్ ఇక 'నెట్ జీరో' సిటీ

**- ఇండస్ట్రీలన్నీ అవుట్**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహారాష్ట్ర ప్రభుత్వం ముంబయిలో నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. దేశ పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు.తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీకి తాము ప్రోత్సాహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామన్నారు.హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని

2లో..

# ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్.?

**- మరో యుద్ధానికి సేనను సిద్ధం చేస్తున్నారా.?**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగుదేశం పార్టీ అధినేత స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ రెండేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల్లో విజయం సాధించడంతో ఇక కూటమి ప్రభుత్వం కూడా లోకల్ బాడీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధించడంలో ఎలాంటి సందేహాలు లేవన్నది నాయకత్వానికి స్పష్టమయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుండటం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అవుతుండటంతో ఇక కూటమి ప్రభుత్వం కూడా త్వరలోనే దీనికి సంబంధించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలున్నాయి. అయితే ఎండల సమయంలో కంటే తర్వాత పోలింగ్ జరపడం మంచిదని భావిస్తున్నట్లు సమాచారం. ఎండాకాలంలో ఓటింగ్ శాతం పై ప్రభావం పడుతుందని, అలాగే కొన్ని ఇబ్బందులు

3లో..

# హైదరాబాద్ ఇక 'నెట్ జీరో' సిటీ

తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు.

### అభివృద్ధి ప్రస్థానం - విద్య, సాగునీరు

స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్సీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు.

### ఎల్పీజీ సంస్కరణలు, టెక్ విప్లవం

1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్పీజీ) సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం, సాఫ్ట్ వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు.

### సుస్థిర అభివృద్ధి - ఆర్థిక లక్ష్యాలు

కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు.

### తెలంగాణ జోన్ల విభజన: క్యూర్, ప్యూర్, రేర్

రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ జోన్‌లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్)గా ప్రకటించగా, ఓఆర్ఆర్, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశించినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి "చైనా ౦1" ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు.

### విద్యుత్ డిమాండ్ - గ్రీన్ ఎనర్జీ గణాంకాలు

తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. రాష్ట్రం రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తోందని తెలిపారు. గత ఏడాది గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది అది 19,000 మెగావాట్లను దాటుతుందని అంచనాలున్నాయని వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8% లేదా దాదాపు 25% గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని తెలిపారు.

### మౌలిక సదుపాయాల విస్తరణ

అదేవిధంగా, 360 కిలోమీటర్ల పొడవు గల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని ప్రధాన తయారీ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో ప్రధాన భాగం గ్రీన్‌గా ఉండాలని తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు.

### క్లైమేట్ ఎమర్జెన్సీ - పర్యావరణ రక్షణ

వాతావరణ మార్పులు, కోవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితిని క్లైమేట్ ఎమర్జెన్సీగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, ఉత్పత్తి, వినియోగం పెంపు కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ మూడు జోన్‌లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని తెలిపారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో దేశంలో అత్యధికంగా ఈవీల స్వీకరణ పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు.

### పర్యావరణ హిత రవాణా - హైడ్రా

తెలంగాణలోనే ఈవీ తయారీ కోసం సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకుపైగా ఆటోరిక్షాలను రిట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్

## - జ్యుడీషియల్ రిమాండ్ విధించిన మంచిర్యాల కోర్టు
## - సుమన్‌తో పాటు మరో ముగ్గురిని కూడా జైలుకు తరలింపు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా తలెత్తిన ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికను మంత్రి వివేక్ వెంకటస్వామి అడ్డుకున్నారని ఆరోపిస్తూ బుధవారం క్యాతనపల్లి బంద్‌కు బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలోనే మరోసారి పరిస్థితులు తీవ్రంగా మారాయి. మంగళవారం రోజున మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీలను అడ్డుకుని, వారి కాన్వాయ్‌పై దాడి చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేశారు పోలీసులు. భారీగా వచ్చిన పోలీసులు బాల్క సుమన్ ఇంట్లోకి ప్రవేశించి తాము అరెస్ట్ చేసేందుకు సహకరించాలని కోరారు. అందుకు బాల్క సుమన్ అంగీకరించకపోవడంతో బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ వ్యాన్‌లో శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు రాగా వారిని బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అక్కడ హైడ్రామా నెలకొంది. పోలీసులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. తీవ్ర ఆందోళనల మధ్య బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు మెడికల్ టెస్టుల కోసం ఆస్పత్రికి తరలించారు. క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా మంగళవారం అక్కడ తీవ్ర ఘర్షణలు జరిగాయి. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై బీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్లు రువ్వారని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపించాయి. ఈ నేపథ్యంలోనే బాల్క సుమన్ సహా చాలా మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలపై క్యాతనపల్లి పోలీసులు కేసులు పెట్టారు. మరోవైపు క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్ ఎన్నికను మంత్రి వివేక్ వెంకటస్వామి అడ్డుకున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు దౌర్జన్యంగా తమపై దాడి చేశారని తమతో తీవ్ర అసభ్యకరంగా ప్రవర్తించారని బీఆర్ఎస్, సీపీఐ పార్టీలకు చెందిన మహిళ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇవాళ క్యాతనపల్లి బంద్‌కు పిలుపునిచ్చారు. ఇక అరెస్ట్‌కు ముందు బాల్క సుమన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సమాజం తలదించుకునేలా క్యాతనపల్లిలో కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆరోపించారు. 22 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం 7 వార్డులే గెలిచిందని కానీ బీఆర్ఎస్, సీపీఐ కలిసి 14 వార్డుల్లో గెలిచామని అయినప్పటికీ ఛైర్మన్ పదవి తమకు దక్కకుండా మంత్రి వివేక్ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తలే రాళ్లు విసిరారని ఆ దాడిలో తమ పార్టీకి చెందిన మూల రాజిరెడ్డి కారు ధ్వంసమైందని తెలిపారు. పోలీసులు కొట్టి కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు వేస్తే తమపై కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పోలీసులపై బాల్క సుమన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం


## - దేశ భవిష్యత్తును ఏఐ నిర్దేశించబోతోందని ఉద్ఘాటన
## - ప్రధాని మోదీతో భేటీ, ఏఐపై సహకారానికి చర్చలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారతదేశం ఒక గొప్ప సాంకేతిక పరివర్తనకు నాంది పలుకుతోందని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషించనుందని ఆల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. ప్రస్తుత దశను పరివర్తన సమయంగా ఆయన అభివర్ణించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ఇది టెక్నాలజీ, ఆవిష్కరణలు, మరియు ఏఐ విస్తృత వినియోగంతో నడిచే ఒక దశాబ్ద కాలపు మార్పుకు నాందిలా అనిపిస్తోంది" అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా లబ్ధి పొందేందుకు భారతదేశం ప్రత్యేకమైన స్థితిలో ఉందని, అయితే ఈ అవకాశంతో పాటు గొప్ప బాధ్యత కూడా ఉంటుందని సుందర్ పిచాయ్ నొక్కిచెప్పారు. ఏఐ పరిశోధనలలో బలమైన పెట్టుబడులు పెట్టాలని, దాని వినియోగాన్ని అన్ని రంగాలకు విస్తరించాలని ఆయన సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి విభాగానికి ఏఐ ప్రయోజనాలు చేరేలా పునాది స్థాయి నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. గత కొన్నేళ్లుగా భారత్ డిజిటల్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించిందని పిచాయ్ ప్రశంసించారు. "భారతీయ వినియోగదారులు వాయిస్ ఆధారిత, ఇమేజ్ ఆధారిత సెర్చ్‌లను ప్రపంచంలోనే అత్యధికంగా స్వీకరిస్తున్నారు. ఇది దేశ ప్రజలు కొత్త టెక్నాలజీలను ఎంత వేగంగా అందిపుచ్చుకుంటున్నారో చూపిస్తోంది," అని ఆయన తెలిపారు. గూగుల్ ఏఐ టూల్ 'జెమినై'కి భారతదేశం అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా నిలవడం, ఇక్కడి వినియోగదారులలో ఏఐ పట్ల పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, సుందర్ పిచాయ్ ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏఐ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి, దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులతో గూగుల్ ఎలా కలిసి పనిచేయగలదనే అంశాలపై వారు చర్చించారు. ఈ భేటీపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఏఐ రంగంలో ప్రభుత్వం, గూగుల్ మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకునే అవకాశాలపై పిచాయ్‌తో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు తెలిపారు. భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరాన్ని కూడా పిచాయ్ ప్రస్తావించారు. పాఠశాల విద్యార్థులలో చిన్న వయసు నుంచే ఆవిష్కరణ, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్'తో కలిసి గూగుల్ పనిచేస్తోందని, తరగతి గదుల్లోకి రోబోటిక్స్, కోడింగ్‌ను తీసుకువెళుతున్నామని వివరించారు. సరైన పెట్టుబడులు, విధానాలు అమలు చేస్తే, భారతదేశ సమగ్ర అభివృద్ధికి, దీర్ఘకాలిక పరివర్తనకు ఏఐ ఒక శక్తివంతమైన సాధనంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

## - ఆకట్టుకున్న యుద్ధ నౌకల పరేడ్



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) విశాఖపట్నం సముద్ర తీరం భారత నౌకాదళ పరాక్రమానికి వేదికైంది. దేశ రక్షణలో కీలక పాత్ర పోషించే నేవీ తన సన్నద్ధతను ప్రపంచానికి చాటిచెప్పేలా 'ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ' (ఐఎఫ్ఆర్)ను అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ చారిత్రక ఘట్టంలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా విచ్చేశారు. సాయుధ దళాల సర్వసైన్యాధ్యక్షురాలి హోదాలో ద్రౌపదీ ముర్ము నౌకాదళ సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ పర్యవేక్షణలో భాగంగా ఆమె ఐఎన్ఎస్ సుమేధ నౌకపై ప్రయాణిస్తూ సముద్రంలో ఆరు వరుసల్లో కొలువుదీరిన యుద్ధ నౌకలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతితో పాటు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొని నౌకాదళ శక్తిని వీక్షించారు. ఈ భారీ ప్రదర్శనలో మొత్తం 71 యుద్ధ నౌకలు పాల్గొన్నాయి. ఇందులో భారత నౌకాదళానికి చెందిన 45 శక్తివంతమైన నౌకలతో పాటు, ప్రపంచంలోని వివిధ దేశాల నుండి వచ్చిన 19 విదేశీ నౌకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇవే కాకుండా కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ మరియు పరిశోధన రంగాలకు చెందిన మరో 7 నౌకలు ఈ విన్యాసాల్లో భాగస్వామ్యమయ్యాయి. ఈ ఫ్లీట్ రివ్యూ కేవలం ప్రదర్శన మాత్రమే కాదు, ఇది అంతర్జాతీయ సముద్ర భద్రత, స్నేహపూర్వక దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించే ఒక వేదికగా మారుతుంది. నౌకలతో పాటు నౌకాదళానికి చెందిన యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు గగనతలంలో చేసిన సాహసోపేత విన్యాసాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. విశాఖపట్నంలోని ఈస్టర్న్ నావల్ కమాండ్ (ఈఎన్సీ) ఈ కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించింది. బ్లూ ఎకానమీ, సముద్ర మార్గాల రక్షణలో భారత్ పోషిస్తున్న అగ్రగామి పాత్రను ఈ ఈవెంట్ మరోసారి స్పష్టం చేసింది. విశాఖపట్నంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో కలసి పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. అంతర్జాతీయ నావికాదళాల భాగస్వామ్యం ఇండో-పసిఫిక్ అంతటా సముద్ర భద్రత, సహకారం పట్ల సమిష్టి సంకల్పాన్ని ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కార్యక్రమం ప్రదర్శించిందనీ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. భారత నౌకాదళం గ్లోబల్ స్థాయిలో ఎదుగుతొందని.. అందుకు తాజా కార్యక్రమం నిదర్శనం అన్నారు.

# జైలు నుంచి విడుదలైన 'ఐబొమ్మ' రవి

## - కోర్టు విధించిన 12 షరతులు ఇవే




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సినిమాలను పైరసీ చేసి ఐబొమ్మ వెబ్‌సైట్ ద్వారా రిలీజ్ చేసిన కేసులో అరెస్ట్ అయిన ఇమంది రవికి బెయిల్ మంజూరైంది. ఈ కేసులో గత 90 రోజులుగా హైదరాబాద్ చంచల్ గూడ జైలులో ఉన్న ఐబొమ్మ రవి కి నిన్న హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా బుధవారం విడుదల అయ్యాడు. సినిమా పైరసీల వ్యవహారంపై ఇప్పటికే పోలీసులు 5 సైబర్ క్రైమ్ కేసులు నమోదు చేశారు. అయితే బెయిల్‌పై బయటికి వచ్చిన ఐబొమ్మ రవి మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోవడం గమనార్హం. ఇక బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, ఇమంది రవికి బెయిల్ మంజూరు చేస్తూ 12 షరతులను విధించింది. వాటిని తప్పకుండా పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక ఈ 12 షరతులకు సంబంధించి ఐబొమ్మ రవి తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట్ గోపీంద్రనాథ్ వెల్లడించారు. ఐబొమ్మ రవికి 12 షరతులతో కూడిన బెయిల్ వచ్చిందని, ఆ బెయిల్ ఆర్డర్ కాపీని చంచల్ గూడ జైలు సూపరింటెండెంట్‌కు అందించినట్లు తెలిపారు. ఇప్పుడు ఇమంది రవి జైలు నుంచి బయటకు వచ్చాడని దేశం విడిచి పెట్టి బయటికి వెళ్లొద్దని హైకోర్టు స్పష్టంగా తేల్చి చెప్పిందని లాయర్ గోపీంద్రనాథ్ వివరించారు. అంతేకాకుండా ఐబొమ్మ రవిని హైకోర్టు కరేబియన్ దీవుల పౌరుడిగానే గుర్తించినట్లు తెలిపారు. అంతేకాకుండా బెయిల్‌పై బయటికి వచ్చిన తర్వాత నిత్యం హైదరాబాద్ సీసీఎస్ పోలీసుల ముందు విచారణకు హాజరు కావాలని హైకోర్టు స్పష్టం చేసింది. అదే సమయంలో ఐబొమ్మ రవి సోషల్ మీడియా అకౌంట్లు వాడొద్దని తేల్చి చెప్పింది. ఇంటర్‌నెట్, వీఎన్‌పీ కూడా వాడొద్దని హైకోర్టు స్పష్టంగా వెల్లడించింది. ఒకవేళ అతడు ఇంటర్నెట్ వాడాలి అనుకుంటే పోలీసుల నుంచి తప్పకుండా అనుమతి తీసుకోవాలని ఆదేశించింది. అది కూడా పోలీసుల ముందే ఇంటర్నెట్ ఉపయోగించుకోవాలని షరతు పెట్టిందని లాయర్ గోపీంద్రనాథ్ వెల్లడించారు.

# మేం అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- అధికార పార్టీకి కొందరు పోలీసులు తొత్తులుగా మారారని విమర్శ
- సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేశారు.

# కూటమిని కూల్చే వరకు పోరాడతా

## - జైలు నుంచి విడుదలైన తర్వాత అంబటి రాంబాబు శపథం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు సుమారు 19 రోజుల జైలు జీవితం తర్వాత బుధవారం సాయంత్రం రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసుతో పాటు, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, 2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి లక్కీ డ్రా పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్న కేసుల్లో ఆయనపై పీటీ వారెంట్లు జారీ అయ్యాయి. వరుసగా ఈ మూడు కేసుల్లోనూ న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన విడుదలకు మార్గం సుగమమైంది. జైలు నుంచి బయటకు రాగానే అంబటి రాంబాబుకు వైసీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తనను జైలు నుంచి బయటకు రానివ్వకుండా అడ్డుకోవడానికి ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నించిందని, వరుస కేసులు పెట్టి వేధించిందని ఆరోపించారు. నన్ను 18 రోజులు జైల్లో పెడితే భయపడతానని అనుకున్నారు, కానీ రాజమండ్రి జైలు నా పట్టుదలకు శిక్షణగా మారింది అంటూ వ్యాఖ్యానించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అక్రమ కేసులు బనాయించారని, తన ఇంటిపై దాడులు చేసి తన భార్య, పిల్లలను ఇబ్బందులకు గురిచేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను జైలులో పెట్టి, నేరస్తులను బయట తిరగనిస్తున్నారని విమర్శించారు. ప్రజలు, ధర్మం నా వెంటే ఉన్నాయి పైన దేవుడున్నాడు, అన్నింటికీ ఒకరోజు సమాధానం చెబుతాను అని ఆయన పేర్కొన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ప్రజాక్షేత్రంలో పోరాటం ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కూటమి ని కూల్చేంత వరకూ పోరాడతానని అన్నారు. జనవరి 31న అరెస్ట్ అయిన అంబటి, తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో జైలుకు వెళ్లడం ఇదే తొలిసారి. ఆయన జైలులో ఉన్న సమయంలో పలువురు పార్టీ నేతలు పరామర్శించారు. విడుదల అనంతరం ఆయన భారీ ర్యాలీగా బయలుదేరారు.

# ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్.?

**ఎప్పుడనేది ఇంకా..**

ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు దీనికి సంబంధించి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. జులై నెలలో అయితే కొంత ఎండల తీవ్రత తగ్గుతుందని భావిస్తున్నారు. లేదంటే ఆగస్టులోనైనా స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి ప్రభుత్వం సిద్ధమన్న సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామికంగా ఎన్నికలు జరగకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చింది. మున్సిపాలిటీల్లోనూ తాడిపత్రి ఒక్కటే టీడీపీ గెలుచుకుంది. ఈ సారి అలా కాకుండా హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ ను స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించే ప్లాన్ ను చంద్రబాబు సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ముందుగా జిల్లాల పర్యటనలు కూడా ఆయన చేస్తారని తెలిసింది.

**ఎన్నికల తర్వాత..**

స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగితే తమ ఓటు బ్యాంకు మరింత బలపడుతుందని, రాజకీయంగా తమకు లాభిస్తుందని చంద్రబాబు అంచనా. అనేక మందికి పదవులు దక్కుతాయి. ఇప్పటి వరకూ పదవులు దక్కలేదని నిరాశలో ఉన్న వారి అసంతృప్తిని చల్లారవచ్చు. మరొకవైపు శాసనసభ్యులను కూడా యాక్టివ్ చేయవచ్చు. వారి నియోజకవర్గంలో జరిగే పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గెలిపించుకునే బాధ్యత వారిపైనే ఉండటంతో వారు నిరంతరం ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. దానివల్ల ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత ఏర్పడుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే వీలయినంత త్వరగానే స్థానిక సంస్థలకు వెళ్లేలా చంద్రబాబు రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## మసీదుల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయండి: కమిషనర్ మయూర్ అశోక్



గుంటూరు(ప్రశ్న న్యూస్ )రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా గుంటూరు నగరంలోని మసీదుల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ చాంబర్ లో ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులతో రంజాన్ పండుగ సందర్భంగా మసీదుల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని మసీదులు, ఈద్గాల పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని, రంజాన్ నెలలో వ్యర్థాల సేకరణ కోసం అదనపు సిబ్బందిని కేటాయించి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని సూచించారు. మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, యాంటీ లార్వా ఆపరేషన్లను ముమ్మరం చేయాలని ప్రజారోగ్య అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నగరంలో రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసే హాలీం సెంటర్లకు తాత్కాలిక ట్రేడ్ లైసెన్సులు జారీ చేయాలని, అదే సమయంలో ఆహార నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని ఎస్ఎస్ లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయా సెంటర్లలో వచ్చే వ్యర్థాలను కమర్షియల్ ఏజన్సీల ద్వారానే సేకరణ జరగాలన్నారు. మసీదులకు వెళ్లే ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు వెలిగేలా చూడాలని, ఎక్కడైనా మరమ్మతులు ఉంటే తక్షణమే పూర్తి చేయాలన్నారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరిగేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, విఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, బయాలజిస్ట్ శేషయ్య, ఈఈ విష్ణు, ఎస్ఎస్ లు రాజేష్, ఐజాక్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు

## మాతృ-శిశు మరణాల నిర్మూలనకు

# కఠిన చర్యలు తీసుకోండి

**- కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల (ప్రశ్న న్యూస్)** జిల్లాలో మాతృ శిశు మరణాలను గణనీయంగా తగ్గించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాతృ- శిశు మరణాల నివారణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇటీవల టంగుటూరు, డబ్ల్యు.కొతపల్లి, యుపిహెచ్‌సి జగజ్జనని నగర్, యుపిహెచ్‌సి అహోబిలం రోడ్ (ఆళ్లగడ్డ), ఎన్.జి.ఓ కాలనీ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలలో నమోదైన ఐదు శిశు మరణాలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసును విడివిడిగా పరిశీలించి, కారణాలను విశ్లేషించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టంగా సూచించారు. కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ–శిశు సంక్షేమ శాఖలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ప్రమాద గర్భిణీలను ముందుగానే గుర్తించి, అవసరమైన పరీక్షలు, పోషకాహారం, వైద్య సేవలను సమయానికి అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. మాతృ–శిశు మరణాలు అత్యంత విషాదకరమైనవే కాకుండా వ్యవస్థలో ఉన్న లోపాలను స్పష్టంగా చూపిస్తున్నాయని, ఇకపై నిర్లక్ష్యం ఏ స్థాయిలోనూ సహించేది లేదన్నారు. ప్రతి గర్భిణీ, ప్రతి శిశువు భద్రత ప్రభుత్వానికి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. గర్భిణీలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం జరిగేలా సమగ్ర పర్యవేక్షణ చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణలు మాతృ–శిశు మరణాలకు ప్రధాన కారణాలని పేర్కొంటూ, వాటిని పూర్తిగా అరికట్టేందుకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు గర్భిణీలను తొలిదశలోనే నమోదు చేసి, హైరిస్క్ కేసులను గుర్తించి పైస్థాయికి నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు.పుట్టిన ప్రతి శిశువు ఆరోగ్యంగా ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. సేవలందించడంలో ఏ విధమైన నిర్లక్ష్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు అని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్వో డా. శారదాబాయి, ఎంసిహెచ్ నోడల్ అధికారి డా. ప్రసన్నలక్ష్మి, ప్రోగ్రాం అధికారి డా. ఎస్.ఎస్. శ్రీజ, నంద్యాల సర్వజన ఆసుపత్రి గైనకాలజీ విభాగం డా. పి. పద్మజ, శిశువిభాగం డా. రవీంద్రనాథ్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎఫ్ ఆర్ మిలన్ విన్యాసాలు

- శ్రద్ధగా సమీక్షించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఎండను సైతం లెక్కచెయ్యకుండా నౌకాదళ విన్యాసాలను వీక్షించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు





**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ ,మిలన్,కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ద్రౌపది ముర్ము తో పాటు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మొహమ్మద్ నజీర్, ఆంధ్రప్రదేశ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నౌకాదళ అధికారులు పాల్గొన్నారు.దేశవిదేశాలకుకు చెందిన సుమారు 71యుద్ధనౌకలు,సబ్మెరైన్లు పాల్గొన్నాయి, మిగ్ యుద్ధవిమానాలు, చేతాకు హెలికాప్టర్లు, కోస్టార్డ్ విమానాలు విన్యాసాలు లో పాల్గొన్నాయి,,రాష్ట్రపతి ద్రౌపది ముర్ము,ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు నేవీ అడ్మిరల్ స్థాయి వి ఐ పి లు ఐ ఎన్ ఎస్ సుమేధ నౌక ద్వారా సమీక్ష విన్యాసాలను తిలకించారు.మిగతా సిబ్బంది మీడియా ప్రతినిధులు ఐ ఎన్ ఎస్ సుకన్య ద్వారా తిలకించారు,, మనదేశానికి చెందిన ఐ ఎన్ ఎస్ ముంబాయ్, ఐ ఎన్ ఎస్ చెన్నై, ఐ ఎన్ ఎస్ రానా, ఐ ఎన్ ఎస్ మకార్, ఐ ఎన్ ఎస్ విశాఖపట్నం, ఐ ఎన్ ఎస్ మైసూర్,ఐ ఎన్ ఎస్ శక్తి,ఐ ఎన్ ఎస్ సాగర్ ప్రతాప్ కోస్ట్ గార్డ్ వెసెలు అలాగే విదేశాలకు చెందిన రష్యా, ఇండోనేసియా,బంగ్లాదేశ్, ఫ్రాన్స్, ఫిలిపైన్స్,మయన్మార్,మలేసియా, సౌత్ ఆఫ్రికా,తదితర దేశాలకు చెందిన యుద్ధ నౌకల నుంచి రాష్ట్రపతి ముర్ము గౌరవ వందనాన్ని సేకరించారు,,మలేసియా,సౌత్ ఆఫ్రికా దేశాలకు చెందిన యుద్ధనౌకల సిబ్బందిలో భారతీయులు ఉండడం విశేషం,అనంతరం చేతకు హేలికాప్టర్లు,ఈస్టర్న్, వెస్టన్, సదరన్,యూనిట్లు ప్రదర్శించిన ఏంజెల్ హెలికాప్టరు విన్యాసాలు,హాక్ విమానాలు, మిగ్ విమానాలు , ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి, కార్యక్రమం మధ్యలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము,గవర్నర్ అబ్దుల్ నజీర్ టోపీలు ధరించి పరేడ్ కార్యక్రమాన్ని వీక్షించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక పక్క ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న ఒక పక్క ఉక్కబోతగా తలంతా చెమట పడుతున్న లెక్క చెయ్యకుండా బ్లాక్ గాగుల్స్ ధరించి మొత్తం కార్యక్రమాన్ని శ్రద్ధగా వీక్షించారు.అనంతరం ద్రౌపది ముర్ము మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలు,దేశాల మధ్య ఐక్యత ను ఫ్లీట్ రివ్యూ ద్వారా ప్రస్ఫుట మవుతాయి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు.ఆర్ కే బీచ్ వద్ద నిర్వహించిన పరేడ్ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది.వివిధ దేశాలు కు చెందినా నావికులు,మనదేశానికి నేవీ , ఎయిర్ ఫోర్స్,ఆర్మీ,లకు చెందిన సిబ్బంది,,బ్లాక్ కాట్ కమాండోలు,ఎన్ సి సి, ఏపీ పోలీస్,నేవీ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థులు,తదితరులు పరేడ్ లో పాల్గొన్నారు,,గిరిజన కళాకారులు థింసా నృత్యాన్ని ప్రదర్శించారు నౌక విమాన ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

# పశువులు తాగే నీరు మేము తాగాలి

- కొండ శిగర గ్రామాల ఆదివాసి గిరిజన మహిళలు మాకు మంచి నీరు సమస్య పరిష్కారం చేయాలి
- గూడెం,దబ్బలపాడు,రాయిపాడు ఆదివాసి గిరిజన మహిళలు నిరసన



అల్లూరి సీతారామరాజు( ప్రశ్న న్యూస్) అనంతగిరి మండలం రొంపెల్లి పంచాయతీ కొండ శిఖర గ్రామాలు గూడెం. దెబ్బలపాడు. ఎన్ ఆర్ పురం పంచాయతీ రాయిపాడు గ్రామాల్లో60 కుటుంబాలు గిరిజనులు కొండ శిఖర గ్రామాల్లో జీవనం సాగిస్తూ ఉన్నారు. గూడెం గ్రామంలో16 కుటుంబాల వారు కోసం తేదీ:13-2-23 సంవత్సరంలో జే .జే .యం జల్ జీవన్ మిషన్ ద్వారా 13 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు జీవో:818 వర రక్షత మంచి నీటి పథకం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించినది మంచినీళ్లు



ఇవ్వలేదు. ఈ మధ్యకాలంలో డిప్యూటీ చీఫ్ మినిస్టర్ ఆదేశం మేరకు మా గ్రామానికి కొత్తగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. ఎలమంచి ఎమ్మెల్యే సుందర విజయ్ కుమార్ వచ్చి స్కూల్ బిల్డింగు మంచినీళ్ల సమస్య పరిష్కారం చేస్తామన్నారు. నెలలు గడుస్తున్న మాకు మంచి నీళ్లు లేక పశు వులు మనుషులు ఒకే చోటే నీళ్ల తాగవలసి వస్తుంది. దబ్బలపాడు గ్రామం ఎనిమిది కుటుంబాలు నివాసం ఉంటున్నాము. జల్జీవన్ మిషన్ ద్వారా10.69 లక్షలు నిధులు మంజూరు చేశారు. నేటికీ పనులు ప్రారంభించలేదు. ఆ గ్రామానికి పశువులు మేము ఒక దగ్గర తాగడంతో నిరంతరం అనారోగ్యం గురవుతున్నాము. ఎన్ ఆర్ పురం పంచాయతీ రాయపాడు గ్రామంలో 28 కుటుంబాలు వారు జీవనం సాగిస్తూ ఉన్నాము. జల్జీవన్ మిషన్ ద్వారా10 లక్షల 40 వేల రూపాయలు నిధులతో 10 కుటుంబాల వారికి ఇంటింటా కొళాయి కనెక్షన్ ఇచ్చారు. మోటర్ పాడైపోవడంతో మూడు నెలల్లో గడుస్తున్న ఇప్పటికీ మంచిని సమస్య పరిష్కారం చేయలేదు. దీంతో పశువులు మేము ఒకే దగ్గర నీళ్ల తాగుతున్నాము. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రక్షక మంచిని తాగడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ప్రచారం చేస్తున్నారు. మా గ్రామాల్లో పశువులు మేము ఒకే దగ్గర నీళ్ల తాగుతున్నాము ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు మంచి నీరు పరిష్కారం చేయవలసిందిగాగేమ్మిల లక్ష్మి. (గూడెం )కోసురు పెద్దమ్మి రొంపిల్లి పంచాయితీ రెండవ వార్డ్ సభ్యుడు సోముల అప్పలరాజు.

# ప్రజలతో ఆడుకోవద్దు:ఎంపి. :పబ్లిక్ కోసం వాకౌట్:ఎమ్మెల్యే

- బడుగు బలహీన వర్గాల వైపు పోవద్దు,చిన్న ఇండ్ల పై కన్నేర్ర చేయొద్దు: ఈటెల
- పాలకులు ప్రజల వారధులు,ప్రొటోకాల్ విస్మరిస్తే పాట్లు తప్పవు,అధికారులను హెచ్చరించిన:ఎంపీ
- కంటోన్మెంట్ లో ఎన్నికలు ఎప్పుడైన రావచ్చు.? రక్షణ మంత్రితో చర్చించాం: ఈటెల
- మేర్జ్ కి మేము అడ్డం కాదు, బోర్డు పరిధిలో సమస్యలు "కెరటం" లా ఎగిసిపడుతున్నాయి.ఫస్ట్ ఎన్నికలకే ప్రాధాన్యత: రాజేందర్







**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం నిన్న బుధవారం ఉదయం 11:00 గంటలకు ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్,బోర్డు అధ్యక్షుడు రాజీవ్,సిఇవో అరవింద్ కుమార్ ద్వివేజ్, సివిల్ మెంబర్ భానుక నర్మదా తదితరులు పాల్గొన్నారు.బోర్డు పరిధిలో ఉన్న ప్రజలు నూతన నిర్మాణాలు చేపడుతేబోర్డు అనుమతులు తప్పనిసరి,మంజూరు అయిన వరకే నిర్మాణం చేపట్టాలని లేని పక్షంలో అధికారులు కూల్చివేతలకుసిద్దం అవుతారని కంటోన్మెంట్ బోర్డు సిఇవో అరవింద్ కుమార్ ద్వివేజ్ పేర్కొన్నారు.అలాగే కేంద్ర మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు బోర్డు నామినేటెడ్ పదవి మరో సంవత్సరం పాటు పొడిగించినట్లు ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు.మరో విషయం ఏమిటంటే సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఇంటి పన్ను అధికంగా వసూలు చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలు తప్పుపడుతూ, వాస్తవానికి నూటికి పది శాతం మే పెంచినట్లు ఆయన వెల్లడించారు.అలాగే ప్రజలు ఆస్తి పన్ను బకాయిలు ఏమైనా ఉంటే వీలైనంత త్వరగా చెల్లిస్తే, కంటోన్మెంట్ అభివృద్ధికి సహకరించిన వారౌతారన్నారు.కేంద్రం నుంచి కొన్ని నిధులు మంజూరు అయిన విషయం వాస్తవమే కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా రావాల్సిన ట్రాన్స్ఫర్ ప్రాపర్టీ ట్యాక్స్ వస్తే బాగుంటుందని ఆయన ఆశించారు.ఎంపీ ఈటల రాజేందర్ మాటల తూటాలు: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ బోర్డు అధికారుల పని తీరును తప్పుబట్టారు.ముఖ్యంగా ఎంపీ,ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు.వీరికి సముచిత స్థానాన్ని భర్తీ చేయాలి కానీ అవమానిస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు.అసలు నాయకులు ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు.అధికారులకిప్రజలకి వారధులుగా ప్రజా ప్రతినిధులు ఉంటారు.అధికార యంత్రాంగానికి తెలియక పోతే "ప్రివిలేజ్"కమిటీ ద్వారా "ప్రొటోకాల్"తెలుసుకుంటే బాగుంటుందని ఎంపీ ఈటల రాజేందర్ విలేకరుల సమావేశంలో అధికారులకు సూచిస్తూ హెచ్చరించారు.ప్రజల పక్షాన న్యాయం కోసం ఎంత దూరమైనా వెళ్తామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.అలాగే కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ తో భేటీ అయిన విషయాన్ని వెల్లడించారు.వీలైనంత త్వరగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల నిర్వహించాలని, నిధులు లేక అల్లాడుతున్న బోర్డును ఆదుకోవాలని,స్థానికంగా ఆర్మీ అధికారులు సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న విషయాన్ని కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఈటెల రాజేందర్ తెలిపారు.గత ఆరు సంవత్సరాలుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు లో ఎన్నికలు లేక అభివృద్ధి కుంటపడినట్లు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మరో విషయం ఏమిటంటే బోర్డు నామినేటెడ్ పదవిని మరో సంవత్సరం పొడిస్తున్నట్లు, ఎన్నికలు ఏ క్షణమైనా ప్రకటన రావచ్చని,అప్పటి దాకా సివిల్ మెంబర్ తో బోర్డు పరిధిలో ఉన్న ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.మరో ఏడాది పదివిలో సేవలు అందించే నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదాకిమితాయి తో శుభాకాంక్షలు తెలియజేశారు ఎంపీ ఈటల రాజేందర్.ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు ధనుంజయ చారి,నర్సింగ్ రావు,భానుక మల్లికార్జున్, రాము,శ్రీకాంత్,రవి తదితరులు పాల్గొన్నారు.కంటోన్మెంట్ బోర్డును వెంటనే రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే శ్రీ గణేష్

**బోర్డు మీటింగ్ ను బహిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూలి:**

కంటోన్మెంట్ ప్రాంత ప్రజల హక్కులను కాలరాస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ గత 6 ఏళ్ళుగా ఎన్నికలు నిర్వహించకుండా, నామినేటెడ్ వ్యవస్థతో సరికొత్త రాచరిక పాలనను అందిస్తున్న రక్షణ మంత్రిత్వ శాఖ.కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వ తీరును ఎండగడుతూ,కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం నామినేటెడ్ సభ్యురాలి మరోసంవత్సరం,ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా నిర్వహిస్తున్న కంటోన్మెంట్ బోర్డు సమావేశాన్ని బహిష్కరించారు.అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ కంటోన్మెంట్"విలీన ప్రక్రియ నినాదంతో కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధి కోసం ఇటీవల 8 రోజుల రిలే నిరహార దీక్షను చేసిన విషయం విదితమే,ఆ రిలే నిరహార దీక్షకు ప్రజలు పెద్ద ఎత్తున తమ మద్దతును అందించారని,స్వచ్ఛందంగా దీక్షలో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు.ఈ దీక్ష అనంతరం నియోజకవర్గం లోని మేధావులు,కాలనీ వాసులు,బస్తీల పెద్దలు, కవులు,కళాకారులతో సమావేశమై వారి అభిప్రాయాలను కూడా సేకరించిన తర్వాత, ఆ సమావేశంలోనే జెఏసి ఏర్పాటు చేయాలని నిర్ణయించామని,రాబోయే రోజుల్లో కంటోన్మెంట్ మెర్జర్ మూవ్ మెంట్ వివిధ రూపాల్లో ఊపిరి పోసుకుంటుందన్నారు.ప్రజల బలమైన కోరికను ఈ రోజు బోర్డు కార్యాలయంలో కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు,బ్రిగేడియర్ రాజీవ్ ని కలిసి కంటోన్మెంట్ ప్రాంత ప్రజల ఆకాంక్ష అయిన కంటోన్మెంట్ మెర్జర్ మూవ్ మెంట్ ను కేంద్ర రక్షణ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.కంటోన్మెంట్ ప్రజల ప్రాథమిక హక్కు అయిన ఓటును వినియోగించుకునేలా, బోర్డును వెంటనే రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలనే డిమాండ్ తో కంటోన్మెంట్ ప్రజల పక్షాన వినతి పత్రాన్ని అందజేసి బోర్డు సమావేశాన్ని బహిష్కరించారు స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్.

# రమణీయం కమణీయం. శివపార్వతుల కల్యాణం

**శ్రీకాళహస్తి,(ప్రశ్న న్యూస్)** దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వర స్వామి శివుడు మరియు జ్ఞానప్రసూనాంబికా దేవి పార్వతి కల్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా జరుగుతుంది. శివపార్వతుల కల్యాణం జగత్కల్యాణంగా భావించబడుతుంది. పరమశివుడు పార్వతీదేవిని పెళ్లాడిన ఈ వేడుకలో శివుడు గజ వాహనంపై అమ్మవారు సింహ వాహనంపై తరలి వస్తారు శివ పార్వతుల కల్యాణకన్నులపండువగా ఆది దంపతుల కళ్యాణం.జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీకాళహస్తిలో పార్వతీ, పరమేశ్వరుల ఆది దంపతులకు కళ్యాణం నిర్వహించారు ముందుగా కలశ స్థాపన, గణపతి పూజ, పుణ్యవచనం , వరుణ పూజ, కలశానికి పుష్పాలతో పూజలు చేసి రక్షాబంధన్, యజ్ఞోపవీత ధారణ, మంగళ సూత్రానికి కుంకుమతో పుష్పాల తో పూజలు చేసి మంగళ వాయిద్యా లతో అత్యంత వైభవంగా కళ్యాణ జరిపారు వేద మంత్రాల నడుమ కన్నుల పండగగా జరుగుతుంది కళ్యాణ వేదికకు స్వామి గజ వాహనంపై ఊరేగింపుగా బయలుదేరగా. అమ్మవారు మణిమయ, రత్న గోమేధీకాభరణాలు అలంకరించుకొని సింహ వాహనంపై పెళ్లి మండపం వద్దకు పయనమైంది.ప్రధానార్చకుల మంత్ర పఠనం పవిత్రమై సాగింది. ప్రధాన పురోహితుడి ద్వారా అమ్మవారి మెడలో స్వామివారు మంగళ సూత్రధారణ చేయడంతో ఆదిదంపతుల కళ్యాణ మహోత్సవం ముగిసింది. జగత్కారకులైన పార్వతీ పరమేశ్వరుల కళ్యాణాన్ని చూసి భక్తజనం పులకించారు. ఇదే శుభముహూర్తంగా భావించి పలు జంటలు చుట్టుపక్కల గ్రామాల నుంచి పలు జంటలు స్వామి అమ్మవారి కళ్యాణమప్పుడు ఆ జంటలు కూడా కళ్యాణం చేసుకుంటారు ఒకటయ్యాయి ఘనంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి కళ్యాణం



జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి కోలా ఆనంద్ దంపతులు ఈవో బాపిరెడ్డి దంపతులు చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ కోటమి ప్రభుత్వం బోర్డు నెంబర్లు సిబ్బందులు అధికారులు పాల్గొన్నారు.

# షాదం సమయంలో సేవా దాతృత్వాన్ని చాటిన అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ

**- సేవే లక్ష్యం దిశగా ట్రస్ట్ ను నిర్వహిస్తున్నాం**

**- అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు : తోట లహరి**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణానికి చెందిన 4వ వార్డు నివాసి మామిండ్ల అనిల్ మృతితో వారి కుటుంబం బుధవారం విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో అంత్యక్రియల అనంతరం కుటుంబ సభ్యులకు అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవా సంస్థ భోజన సదుపాయం కల్పించింది.రేగుల రాజ్‌కుమార్ ట్రస్ట్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో, సంస్థ నిర్వాహకులు తక్షణమే స్పందించి భోజనం పంపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తోట లహరి మాట్లాడుతూ --- వేములవాడలో ఎవరైనా మరణించినప్పుడు బాధిత కుటుంబాలు లేదా స్థానికులు ట్రస్ట్ నంబర్ 8919376459కు సమాచారం అందిస్తే, ఉచితంగా భోజనం పంపిస్తామని తెలిపారు. బాధలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం తమ సంస్థ లక్ష్యమని వెల్లడించారు.

# టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై చర్చకు సిద్ధం.హోంమంత్రి అనిత



**అమరావతి(ప్రశ్న న్యూస్)** టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై తాము చర్చకు సిద్ధమని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజాహితం గురించి ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని, ఆధారాలతో రావాలని వైసీపీ సభ్యులకు సవాల్ విసిరారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి అనిత మాట్లాడారు. టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ తమ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టులో అసలు అది నెయ్యి కాదని,రసాయనాల మిశ్రమమని చెప్పిందని తెలిపారు. గతంలో కూడా పింక్ డైమండ్ గురించి వైసీపీ సభ్యులు సభ సమయాన్ని వృథా చేశారని విమర్శించారు. అధికారుల విచారణలో పింక్ డైమండ్ అనేది లేదని తేలిందన్నారు. హెరిటేజ్ 34 సంవత్సరాలుగా ఉన్న సంస్థ అని,హెరిటేజ్ నుంచి దేవాలయాలకు నెయ్యి పంపిణీ చేయకూడదనే నిబంధన పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు.

## సభలో రాద్ధాంతం చేస్తే కుదరదు

వైసీపీ సభ్యులు సంబంధం లేని విషయాలని సభకు తీసుకువచ్చి రాద్ధాంతం చేస్తే కుదరదని, ఆధారాలు ఉంటే రండి చర్చకు సిద్ధమని హోంమంత్రి అనిత సవాల్ విసిరారు. వైసీపీ నేతలకు దేవుడంటే లెక్క లేదని మండిపడ్డారు. టీటీడీ నెయ్యికి సంబంధించి సేకరణ లేని సంస్థకు జగన్ హయాంలో కాంట్రాక్ట్ ఇచ్చారని, ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని ఛాలెంజ్ చేశారు. ఎవరితోనైనా ఆడుకోండని కానీ వేంకటేశ్వరస్వామితో ఆటలాడొద్దని హెచ్చరించారు. సాక్షి పేపర్‌లో రాసిన విషయాలని వైసీపీ సభ్యులు సభలో మాట్లాడుతున్నారని హోంమంత్రి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నగరాభివృద్ధిని అడ్డుకున్న వైసిపి కౌన్సిల్

**- త్వరలో పీడ విరగడ**

**- రాబోయే కొత్త కౌన్సిల్ తో రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రామ్ వాటర్ సమస్యలకు పరిష్కారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

**- గురునానక్ కాలనీలో నూతన ఇన్‌ఫ్రారెడ్ రోడ్ రిపేరింగ్ మొబైల్ మిషన్ ప్రారంభం**

**- జెండా ఊపి మొబైల్ మిషన్ ను ప్రారంభించిన ఎంపీకేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్**



విజయవాడ (ప్రశ్న న్యూస్ ) గత ఐదు సంవత్సరాలుగా విజయవాడ నగర అభివృద్ధిని అడ్డుకున్నవి.ఎం.సి వైసిపి కౌన్సిల్ సమయం త్వరలో ముగియనుండటంతో నగరానికి పట్టిన చెద, పీడ విరగడ కానుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నగర పాలక సంస్థకు కేంద్ర 15వ ఆర్థిక సంఘం గ్రాంట్ ద్వారా రూ.1.48 కోట్ల వ్యయంతో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక ఇన్‌ఫ్రారెడ్ రోడ్ రిపేరింగ్ మొబైల్ మిషన్ ను బుధవారం గురునానక్ కాలనీలోని మెయిన్ రోడ్ లో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వి.ఎం.సి అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆ మొబైల్ మిషన్ పని తీరును గమనించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎన్‌క్యాప్ (ఈ న్ సి ఏ పీ) ద్వారా మంజూరైన ఈ మిషన్‌ను నగర రోడ్ల అభివృద్ధి, కాలుష్య నియంత్రణలో విస్తృతంగా వినియోగించనున్నట్లు తెలిపారు. ఇక నగరాభివృద్ధికి సంబంధించి ఏ ప్రతిపాదన వచ్చినా వైసిపి కౌన్సిల్ తిరస్కరిస్తోందన్నారు. గత ఐదేళ్లుగా వి.ఎం.సి కౌన్సిల్ లో టిడిపి నాయకులు, కార్పొరేటర్లు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రజలకు మేలు చేసే ప్రాజెక్టులు రాజకీయ కారణాలతో నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, ముమ్మనేని ప్రసాద్, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) వి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సామ్రాజ్యం, డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు లతో పాటు ఎన్.డి.యే కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక

# ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**- బైర్లూటి ముర్తుజావలి దర్గాలో ఎంపీ ప్రత్యేక ప్రార్థనలు, చాదర్ సమర్పణ.**

**- బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్. షబానా**



**నంద్యాల (ప్రశ్న న్యూస్)** కులాలు, మతాల కంటే మానవత్వమే మిన్న అని, అందరినీ సమానంగా గౌరవించడమే నిజమైన ప్రజాస్వామ్యమని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి మరోసారి చాటిచెప్పారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, శ్రీశైలం బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి మోమిన్ షభానా అన్నారు.బుధవారం ఆత్మకూరు బిజెపి అసెంబ్లీ కార్యాలయంలో షభానా మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శ్రీశైల పుణ్య క్షేత్రంకు నల్లమల అరణ్యంలో కాలినడకన వెళ్తుతున్న సందర్బంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాదయాత్రకు సంఘీభావం తెలిపాం అన్నారు. ఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధిగాంచిన బైర్లూటి ముర్తుజావలి దర్గాను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రతి ఏటా కాలినడకన అరణ్యం గుండా వెళ్లుతూ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అత్యంత భక్తిశ్రద్ధలతో చాదర్ సమర్పించడం ప్రత్యేకం అన్నారు.శ్రీశైల నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని బీజేపీ నాయకురాలు షబానా ఆకాంక్షించారు.ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మతసామరస్యానికి నిలువుటద్దం అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా కొనియాడారు. హిందూ పండుగైన శివరాత్రి వేళ శ్రీశైల మల్లికార్జునుడి దర్శనానికి వెళ్తూ, మార్గమధ్యలో ఉన్న దర్గాను సందర్శించడం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విశాల హృదయానికి నిదర్శనమన్నారు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేవలం ఒక వర్గానికో, కులానికో పరిమితమైన నాయకురాలు కాదని. హిందూ, ముస్లిం, క్రైస్తవ.. ఇలా అందరినీ తన కుటుంబ సభ్యుల్లా భావించే గొప్ప సంస్కారం ఆమెదని అన్నారు. ?ఒకవైపు నల్లమల అరణ్యం శివనామ స్మరణతో శ్రీశైల యాత్ర చేస్తూనే, మరోవైపు దర్గాలో ప్రార్థనలు నిర్వహించిన ఎంపీ శబరి తీరుపై స్థానిక ముస్లిం పెద్దలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, కులమతాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలకు స్వస్తి పలికి, ఇటువంటి సామరస్య ధోరణి కలిగిన నాయకురాలు తమ ఎంపీగా ఉండటం గర్వకారణమని ముస్లిం మత పెద్దలు, బీజేపీ నాయకురాలు మోమిన్ షబానా పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

**- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్ నందు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక , రెండు పడకల గదుల ఇండ్లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల మంజూరీలో పారదర్శకతగా వ్యవహరిస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అందించటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎల్ వన్ కింద 4800 మంది అర్హులైన ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు రెండు పడకల గదుల ఇల్లు నిర్మించుటకై నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అలాగే ఎల్ టు (ఎల్ 2) కింద హైదరాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకు పైగా దరఖాస్తులు వివిధ నియోజకవర్గాల నుండి పేద ప్రజలు అందజేశారని మంత్రి వివరించారు. హైదరాబాద్ మహానగరంలో స్థలాలు సేకరించి జీ ం 5-10 వరకు ఇందిరమ్మ ఇల్లు చేపట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి వివరించారు..పెండింగ్ లో ఉన్న ఇల్లు పనులు పూర్తి చేసి అర్హులకు అందించాలని అధికారులకు సూచించారు.ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయి.. లబ్ధిదారులు ఎంత మంది తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో లబ్ధిదారులకు అందించమని ఇంకా పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ,అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై శాసనసభ్యులతో కలిసి మంత్రులు సమీక్షించారు. తదుపరి హైదరాబాద్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల శాసనసభ్యుల అభిప్రాయాలను ఈ సందర్భంగా స్వీకరించి చేపట్టే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, పిడి హౌసింగ్ అశోక్ చక్రవర్తి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి: కలెక్టర్ కృతిక శుక్లా



పల్నాడు(ప్రశ్న న్యూస్ )ఈనెల 21వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినుకొండలో పర్యటించనున్న నేపథ్యంలో, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనలో ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.?'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమం పర్యటనలో భాగంగా వినుకొండలోని ఎన్.ఎస్.పి (ఎన్ఎస్పి) గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న ప్రజా వేదికను సర్వాంగ సుందరంగా సిద్ధం చేయాలన్నారు. ప్రజా వేదిక ప్రాంగణంలోనే ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన స్టాల్స్‌ను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని, అక్కడికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో నిమగ్నమై పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ కృతిక శుక్లా ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.?ఈ సమావేశంలో జిల్లా ఏరియా ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసూన, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రీజినల్ అధికారిణి నజీరా బేగం, ఆసుపత్రి సూపరింటెండెంట్ దయానిధి, ఏపీ ఎం.ఎస్.ఐ.డి.సి అధికారి హనుమంతరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరిసిన క్రీడాకారులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందనలు

**- పవర్ లిఫ్టింగ్, అస్మితా రోల్ బాల్‌లో గుంటూరు క్రీడాకారుల ప్రతిభ**



గుంటూరు(ప్రశ్న న్యూస్) యువత తమ ప్రతిభను చాటుకుంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశిష్ట విజయాలు సాధిస్తున్నారని, వీరి విజయాలు జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఇటీవల కర్నూల్ లో 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన అమరావతి రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు క్రీడాకారులు మెడల్స్ సాధించి ప్రతిభ కనబరిచారు. 76 కేజీల విభాగంలో టి. నాగజ్యోతి బంగారు పతకం సాధించడమే కాకుండా "ఉక్కు మహిళ" అవార్డును కూడా దక్కించుకున్నారు. అదేవిధంగా టీం ఛాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం సాధించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు.పీ. రీహాన్ ఖాన్ 53 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం సాధించగా, కే. సత్యరామరాజు 53 కేజీల విభాగంలో డెడ్ లిఫ్ట్‌లో బంగారు పతకం గెలుచుకున్నారు. వినోద్ కుమార్ 74 కేజీల విభాగంలో డెడ్ లిఫ్ట్‌లో బంగారు పతకం సాధించారు.అదేవిధంగా, రోల్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 14, 15 ఫిబ్రవరి 2026 తేదీల్లో ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ సింగరాయకొండ, ప్రకాశం జిల్లాలో నిర్వహించిన "అస్మితా రోల్ బాల్ లీగ్" పోటీల్లో గుంటూరు నుంచి కైవల్య శ్రీ, మనస్విని, అమూల్య, హృతిక యశోద, లేహశృతి ఐదు మ్యాచ్‌లలో నాలుగు మ్యాచ్‌లు గెలిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరిలో హరిద్వార్, ఉత్తర ఖాండ్ లో నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలుటి. నాగజ్యోతి, జీ. స్వాతి సాధించారు. ఈ క్రీడాకారులందరని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి అభినందించారు. వీరికి శిక్షణనిచ్చిన కోచ్‌లు షేక్ ఇమ్రాన్, షేక్ ఇష్రత్‌లను అందరూ అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, "మన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ మెడల్స్ సాధించి గుంటూరు పేరు మరింత ప్రతిష్టాత్మకంగా నిలబెట్టాలని" ఆకాంక్షించారు. క్రీడాకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కోచ్ ఖమురుద్దీన్, షేక్ అబ్దుల్ రహీం, చంద్రగిరి బాబు, డాక్టర్ సుస్మిత, సయ్యద్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## 34 ఏళ్ల నిష్కళంక చరిత్రకు

# మచ్చ తెచ్చే ప్రయత్నం వైసీపీ చేస్తోంది

**- హెరిటేజ్‌పై వైసీపీ రాజకీయ కుట్రలు చేస్తుంది**

**- చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** 34 ఏళ్ల నిష్కళంక చరిత్ర కలిగిన హెరిటేజ్ సంస్థపై మచ్చ వేయడానికి వైసీపీ ప్రయత్నిస్తోంది అని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ పేర్కొన్నారు. గత రెండు రోజులుగా శాసనమండలిలో ఛైర్మన్ వ్యవహారాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆమె అన్నారు. సంబంధం లేని కంపెనీల గురించి సభలో చర్చించడం వల్ల సభా సమయం వృథా అవుతుందని ఆమె విమర్శించారు. సంబంధం లేని సంస్థల చరిత్రను ప్రస్తావిస్తూ వాటిని దూషించడం వైసీపీ నాయకుల తీరుకు నిదర్శనమని ఆమె అన్నారు. హెరిటేజ్ సంస్థ 34 సంవత్సరాలుగా విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ విశ్వసనీయతను సంపాదించుకుందని ఆమె తెలిపారు. 15 రాష్ట్రాల్లో హెరిటేజ్ వ్యాపారాలు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతున్నాయని, ఎక్కడా సంస్థపై చిన్నపాటి మచ్చ కూడా లేదని స్పష్టం చేశారు. హెరిటేజ్ సంస్థకు గోల్డెన్ పీకాక్ అవార్డు లభించడం దాని ప్రతిష్టకు నిదర్శనమని, ఇటీవల భువనేశ్వరి గారు ఆ అవార్డును స్వీకరించారని గుర్తుచేశారు. మండలిలో పదేపదే ఇందాపూర్ డెయిరీ అంశాన్ని ప్రస్తావించడం అవగాహనలేమికి సంకేతమని ఆమె అన్నారు. వైసీపీకి కనీస అవగాహన ఉంటే ఇలాంటి ఆరోపణలు చేయరని వ్యాఖ్యానించారు. జగన్ అనేక కేసుల్లో, మనీ లాండరింగ్ కేసులో కూడా ఇరుక్కొని ఉన్నారని ఆమె ఆరోపించారు. వ్యాపార విధానాలు ఎలా ఉంటాయో జగన్‌కు అవగాహన లేదని విమర్శించారు. ఇందాపూర్ డెయిరీ ఒక కో-మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్ మాత్రమేనని, దానిని హెరిటేజ్‌లో భాగమని చెప్పడం సరైనది కాదని ఆమె తెలిపారు. ఒక సంస్థ తయారు చేసిన ఉత్పత్తులను మరో సంస్థ వినియోగించడం సాధారణమేనని ఉదాహరణగా టయోటా మారుతీ సుజుకీ సంస్థలను ప్రస్తావించారు. అలాగే టైమ్స్ ఆఫ్ ఇండియా కో-ప్రింటింగ్ సాక్షి ప్రింటింగ్ ప్రెస్‌లో జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సంబంధం లేకుండా ఇందాపూర్ డెయిరీ అంశాన్ని లేవనెత్తడం తగదని అన్నారు. ఇటీవల టీటీడీ మాజీ ఛైర్మన్ సుబ్బారెడ్డి తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఒప్పుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ అంశాన్ని పక్కనపెట్టి లేనిపోని విషయాలను పెద్దదిగా చూపించే ప్రయత్నం వైసీపీ నాయకులు చేస్తున్నారని ఆమె విమర్శించారు.

# అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలి

**- రెవెన్యూ పరిపాలనలో పారదర్శకత, సమయపాలనకే ప్రాధాన్యం**

**- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**



**అనకాపల్లి (ప్రశ్న న్యూస్)** రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ సేవలలో సమయపాలన, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనను కట్టుదిట్టం చేయాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ డి.ఆర్వో. ,ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఉదయం కలక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రెవెన్యూ, సర్వే భూమి రికార్డులు, పౌర సరఫరాల శాఖల పై మండల, డివిజన్ ల వారిగా గ్రామ వార్డు సచివాలయల సర్వీస్ లు, రెవెన్యూ క్లినిక్, పి జి ఆర్ ఎస్ లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు ప్రతి రోజు క్షేత స్థాయిలో మానిటరింగ్ చేసి, రెవెన్యూ సేవలలో ఆలస్యం లేకుండా ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలన్నారు. జిల్లాలో వివాదరహిత భూ రికార్డులు, బాధ్యతాయుత రెవెన్యూ పరిపాలన కోసం అధికారులు మరింత చురుకుగా పనిచేయాలన్నారు. ఆన్లైన్ సేవలు, భూ మ్యాపింగ్, రికార్డులు అప్డేషన్, మ్యుటేషన్ దరఖాస్తులు వంటి సమస్యలపై కార్యాచరణ ప్రణాళిక తయారుచేసుకొని పరిష్కరించాలన్నారు. లోపాలు ఉన్న చోట వెంటనే సరిదిద్దాలని, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించాలన్నారు. మండల స్థాయిలో తరుచూ క్షేత్ర స్థాయిలో పర్యటించి విచారణ చేయాలన్నారు. పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్ లలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే విచారణ చేయాలన్నారు. నీటి తీరువ పన్ను వసూలు కోసం ప్రతి మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, డి.అర్వో., వై.సత్యనారాయణ రావు, ఎన్ ఎ ఓ బి, కె ఆర్ ఆర్ సి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు కె.మనోరమ, ఎస్. సుబ్బలక్ష్మి, అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా, ఎడి సర్వే, జిల్లా పౌర సరఫరాల అధికారి పౌర సరఫరాల డి.ఎం., డి సి ఎస్ ఓ లు కె.ఎన్.మూర్తి, కె జయంతి, అన్ని మండలాల తహసీల్దార్లు, కలక్టరేట్ పరిపాలన అధికారి, మేజిస్ట్రియల్, కో ఆర్డినేషన్, భూ వ్యవహారాల పర్యవేక్షకులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకొని యువకుడు మృతి

**- బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ : రమాకాంత్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, వరదవెల్లి అనుబంధ గ్రామమైన దుబ్బపల్లిలో విషాదం చోటుచేసుకుంది. రామంచ సంజయ్ (18) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సంజయ్ హైదరాబాద్‌లోని అవంతి కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేక కాలేజీ ఫీజులు చెల్లించలేకపోవడంతో గత మూడు నెలలుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు తన అక్క వివాహం విషయమై కూడా మనస్తాపానికి గురవుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ క్రమంలోనే బుధవారం ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో చిన్న విషయంపై తండ్రి మందలించగా, సంజయ్ ఇంట్లో ఫ్యాన్‌కు టవల్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని,మృతుడి తండ్రి రామంచ అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోయినిపల్లి ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

# కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాలను సాధించాలి

**- పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలి**

**- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి : రజిత**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రజిత బుధవారం బోయినిపల్లి మండలం,కొదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకాల నిల్వలు, కోల్డ్ చైన్ నిర్వహణను పరిశీలించారు. ఐస్ లైన్ రిఫ్రిజిరేటర్‌లో ఉష్ణోగ్రతను ం2 నుంచి ం8 డిగ్రీల సెల్సియస్ మధ్య తప్పనిసరిగా కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, 0--5 సంవత్సరాల లోపు పిల్లలకు టీకాలు సకాలంలో వేయాలని, కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని ఆదేశించారు.ఈ తనిఖీలలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. సంపత్ కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి డా. ప్రియాంకతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# స్టేట్ టు బూత్, ప్రతి సమాచారం, లీడర్ టు క్యాడర్ పోస్టర్ విడుదల

**- మై టీడీపీ' యాప్ డౌన్లోడ్ చేసుకోండి**

**- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**



**విజయవాడ (ప్రశ్న న్యూస్)** తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరరూ మై టీడీపీ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే వారి కార్యాలయంలో "స్టేట్ టు బూత్, ప్రతి సమాచారం, లీడర్ టు క్యాడర్" పోస్టర్ ను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఆలోచనలతో ప్రతి టీడీపీ కార్యకర్తకు ఉపయోగపడేలా ఈ యాప్ రూపొందించినట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వ పథకాలు, పనులకు సంబంధించిన వివరాలు మొత్తం ఇందులోనే తెలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి నుంచి బూత్ స్థాయి సమాచారం వరకూ ఇందులో అందుబాటులో ఉంటుందన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి సంభందించిన తాజా వార్తలు, సమగ్ర సమాచారంతో "మై టీడీపీ" యాప్ మీ ముందుకు వచ్చిందన్నారు. పార్టీకి సంబంధించి ప్రతి అప్డేట్‌ను ఇందులో మీరు పొందవచ్చు. అలాగే మీకు సంబంధించిన గ్రీవెన్స్‌ను ఈ యాప్ ద్వారా తెలియజేయవచ్చు. పార్టీ కొరకు మీరు చేసే ప్రతి పని, సోషల్ మీడియా ద్వారా గ్రౌండ్ లెవెల్‌లో మీ యాక్టివిటీస్ అన్ని ఈ యాప్ ద్వారా అధిష్టానానికి తెలుస్తుంది. కుటుంబ సాధికార సారథులు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యూనిట్ ఇంచార్జిలు, క్లస్టర్ ఇంఛార్జిలు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు ఈ యాప్ ను తప్పనిసరిగా డౌన్లోడ్ చేసుకొనగలరు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్థాయికి వ్యవసాయ సాంకేతికలు చేరాలి

**- ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయంలో రైతులకు ఉపయోగపడే సాంకేతికతలు పరిశీలించిన ఎంపీ గురుమూర్తి**



**తిరుపతి (ప్రశ్న న్యూస్)** ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంను తిరుపతి లోక్‌సభ సభ్యులు మద్దిల గురుమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న వివిధ వ్యవసాయ పరిశోధనలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, రైతులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలపై అధికారులు శాస్త్రవేత్తలు ఎంపీకి సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా ఆర్గానిక్ ఫార్మింగ్‌కు ఉపయోగపడే బయో పెస్టిసైడ్స్ అభివృద్ధి, వాటి తయారీ విధానం, పంటలపై వాటి ప్రభావం, ఖర్చు తగ్గింపు మరియు పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్ర గురించి విశదీకరించారు.రసాయన ఎరువులు, కీటకనాశక మందుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను తగ్గించడంలో ఈ బయో పెస్టిసైడ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. సహజసిద్ధమైన సూక్ష్మజీవులు వృక్షసారం ఆధారంగా తయారయ్యే ఈ ఉత్పత్తులు మట్టిసారాన్ని కాపాడుతూ, రైతులకు ఆరోగ్యకరమైన మరియు నిలకడైన వ్యవసాయ పద్ధతిని అందిస్తున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి కోసం పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేస్తున్న సాంకేతికతలను గ్రామస్థాయికి చేరవేయడం అత్యంత అవసరమని అన్నారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, బయో పెస్టిసైడ్స్ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వం మరియు విశ్వవిద్యాలయం సమన్వయంతో రైతులకు మద్దతు అందిస్తే ఆర్గానిక్ వ్యవసాయం విస్తృతంగా ప్రాచుర్యం పొందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# మెరుగైన ఆయుష్ సేవల దిశగా చట్ట సవరణ

**- ప్రజల్లో విశ్వాసం, సేవల నాణ్యత పెంచే ప్రతిపాదనకు అసెంబ్లీ ఆమోదం**

**- ఆయుష్ క్లినిక్‌లు, ఆసుపత్రుల నిర్వహణపై పర్యవేక్షణ**

**- పెరుగుతున్న ప్రజాదరణ నేపథ్యంలో సవరణలు సూచించిన**

**- మంత్రి సత్య కుమార్ యాదవ్.**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆయుష్ సేవల విస్తృతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఈ సేవల నాణ్యతను పెంచుతూ ప్రజల్లో మరింత విశ్వాసాన్ని కలిగించేందుకు అవసరమైన చట్ట సవరణ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారంనాడు శ్రీకారం చుట్టింది. ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్న ఆయుష్ క్లినిక్‌లు, ఆసుపత్రులు తగు ప్రమాణాలతో కూడిన సేవల్ని అందించేందుకు శాసన సభలో వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రతిపాదించిన చట్ట సవరణ బిల్లును శాసన సభ ఆమోదించింది.

### చట్ట సవరణ లక్ష్యాలు

రాష్ట్రంలో ప్రస్తుతం అల్లోపతి వైద్యం అందిస్తున్న ఆసుపత్రులపైనే ప్రభుత్వ నియంత్రణకు అవకాశముంది. ఆయుస్ క్లినిక్‌లు, ఆసుపత్రులు నియంత్రణ పరిధిలో లేవు. దరిమిలా ఆయుష్ సేవల్ని అందిస్తామంటూ పెద్ద ఎత్తున క్లినిక్‌లు, ఆసుపత్రులు ఏర్పాటవుతున్నాయి. ఇవి తగు ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి ఎటువంటి అధికారం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అమలులో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్, 2002 చట్టానికి" సవరణను మంత్రి ప్రతిపాదించారు. ఈ చట్టం ప్రకారం ప్రస్తుతం కేవలం అల్లోపతిక్ ఆసుపత్రుల నిర్వహణను మాత్రమే అజమాయిషీ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికుంది. ఆయుష్ ఆసుపత్రుల నిర్వహణలో కూడా తగు ప్రమాణాలు అనుసరించే లక్ష్యంతో ఈ చట్టం పరిధిలోకి ఆయుష్ ఆసుపత్రుల్ని చేర్చాల్సిన అవసరముందని మంత్రి సభకు తెలిపారు. ఆయుష్ సేవలకు సంబంధించిన 1956 చట్టం ప్రకారం అర్హులైనవారు మాత్రమే ఆయుష్ సేవల్ని అందించేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆసుపత్రులకు సంబంధించి అటువంటి నియమ నిబంధనలు లేనందున అనర్హులైన వారు ఆయుష్ సేవల పేరుతో క్లినిక్‌లు, ఆసుపత్రులను పెద్ద ఎత్తున నిర్వహించడం ఆందోళనకు దారితీసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 2002 చట్టాన్ని సవరించి ఆయుష్ ఆసుపత్రులు కూడా తగు ప్రమాణాలు పాటిస్తూ నిర్వహించే దిశగా ముందడుగు వేసింది. ఈ చట్ట సవరణ బిల్లును ఉభయ సభలూ ఆమోదించిన తర్వాత నిర్వహణ నియంత్రణకు సంబంధించిన బోర్డులు మరియు అపిలేట్ బోర్డుల్లో ఆయుష్ వైద్యులకు తగు ప్రాతినిధ్యం కల్పిస్తారు. చట్ట సవరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయుష్ సేవల నిర్వహణ ప్రమాణాలు పెరుగుతాయని, పారదర్శకత వస్తుందని, నిర్ణీత అర్హతలతో సేవలందించే వారికి తగు రక్షణ లభిస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు

# జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**- కలెక్టర్ డా, ఎస్. వెంకటేశ్వర్**




**తిరుపతి (ప్రశ్న న్యూస్ )** శ్రీసిటీ ఫేజ్ -2, ఎల్ జి ఫేజ్-2, స్పేస్ సిటీ ఫేజ్ 1, 2,3,4, నాయుడుపేట ఫేజ్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సంబందిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీ ఫేజ్ -2, ఎల్ జి ఫేజ్-2,స్పేస్ సిటీ ఫేజ్ 1, 2,3,4, నాయుడుపేట ఫేజ్ 2, కొల్లడం, ఇరుగుళం, పెద్దేటి పాకం, రాళ్ళ కుప్పం లోని ప్రాజెక్టు లకు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, ఏ డీబి రోడ్డులు, పనులపై జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యు అధికారి జి.నరసింహులు తో కలసి వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పి డి లు, సదరన్ రైల్వే ప్రాజెక్టు అధికారులు రాధాకృష్ణ, ప్రభాకర్, తిమ్మయ్య తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎల్. శివకుమార్, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, ఈ ఈ ఇరిగేషన్ సంబంధిత మండలాల తహాసీల్దార్లు, కాంట్రాక్టర్లు, తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సిటీ ఫేజ్ -2, ఏ పి ఐ ఐ సి లోని ఎల్ జి ఫేజ్ -1,2, శ్రీ సిటీ ఫేజ్ -1, 2,3,4, నాయుడుపేట ఫేజ్ 2, కొల్లాడం, ఇరుగుళం లోని ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిస్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై నడికుడి-శ్రీకాళహస్తి, ఏర్పేడు-పూడి, గుమ్మడి పూడి-గూడూరు, గూడూరు-రేణిగుంట, తిరుపతి-కాట్పాడి సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, రేణిగుంట- కడప రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులు పూర్తి కావాలని అన్నారు. పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు.

అలాగే ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఫారెస్ట్, జల వనరుల శాఖ అధికారులు అందరూ కలసి సమన్వయంతో పెండింగ్ పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్ రెడ్డి, శ్రీ సిటి మేనేజర్ భగవాన్, సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు, సెక్షన్ అధికారులు భాస్కర్, శివప్రసాద్, శిరీష భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలకులకు ఐఏఎస్, ఐపీఎస్‌లు బానిసులాగా మారవద్దు

**- ట్రంప్ కు దేశాన్ని తాకట్టు పెట్టిన మోడీ**

**- వ్యవసాయ, చేనేత రంగాలకు తీరని నష్టం - సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వెల్లడి**




**కాకినాడ (ప్రశ్న న్యూస్)** అమెరికా విధానాలకు, ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు వల్ల దేశంలోని వ్యవసాయ, చేనేత రంగం నాశనం అయిపోతుందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ విధానాలకు సాగిలాపడి ప్రధాని మోడీ బానిసగా వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. కాకినాడలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు సందర్భంగా ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేసింది వాళ్లకు కోట్లాది రూపాయలను రుణాలు మాఫీ చేస్తుందన్నారు బ్యాంకులకు తాకట్టు పెట్టిన వారిలో 26 మంది ఉండగా వారిలో 27మంది గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారని సుమారుగా వారికి 27 లక్షల కోట్ల రూపాయల రుణాలను ఎగ్గొట్టారన్నారు. వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఆ రుణాలను మాఫీ చేస్తుందన్నారు. ప్రపంచానిని కుదిపి వేసిన ఎప్స్టీన్ ఫైల్స్లో మోడీ పేరు రావడంతోనే ఆయన అమెరికాకు సాగిల పడి దేశ పరువు తీసారన్నారు. కార్పొరేట్ల మేలు కోసం అటవీ చట్టాలను మార్పు చేసి అడవి సంపదను వారికి దోచిపెడుతున్నారన్నారు. ఆదివాసికి చెందిన రాష్ట్రపతితో అటవీ చట్టాన్ని మార్పు చేసి సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టి నక్సల్ పేరుతో గిరిజనులను చంపేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు బీజేపీతోనే ఉన్నాయని వీరి పోరాటం రాష్ట్రంలో కూటమి, వైసీపీలుగా ఉన్నా ఢిల్లీలో మాత్రం కలిసి ఉంటున్నారని చెప్పారు. బిల్ గేట్స్ను తీసుకువచ్చి అమరావతిలో అరటి తోటలను చూపించిన సీఎం చంద్రబాబు కేంద్రంలో వ్యవసాయ రంగానికి మోసం చేస్తున్న మోడీని మాత్రం నిలువరించడంలో భయపడుతున్నట్లు చెప్పారు. వ్యవసాయ భూములను కారు చౌకగా కార్పోరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారని ఇలా కార్పోరేట్లకు ఊడిగం చేయడంలో మోడీ, బాబు పోటీ పడుతున్నారని నారాయణ ఎద్దేవా చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆయా నాయకులకు బానిసలుగా ఉండొద్దని సూచించారు. నాయకులు మాట విని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి నేటికీ కూడా శిక్షను ఎదుర్కొంటున్నారని అందువల్ల ఆ అధికారులు స్వతంత్రంగా వ్యవహరించాలని నారాయణ కోరారు. తిరుమల లడ్డు కల్తీ వ్యవహారాల్లో బాధ్యులైన వారిని శిక్షించి కోట్లాది రూపాయలు చేతులు మారిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఉన్న సమస్యలపై పోరాటం చేసి సీపీఐని బలోపేతం చేస్తామని నారాయణ చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

### యానాం ఎమ్మెల్యే అవినీతిపరుడిగా మారాడు..

పుదుచ్చేరి రాష్ట్రంలోని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ బీజేపీ పంచన చేరి అత్యంత అవినీతిపరుడుగా మారాడని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. విలేకర్ల సమావేశంలో నారాయణ ఇలా స్పందించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన గొల్లపల్లి శ్రీనివాస అశోక్ కొద్దిరోజుల తర్వాత బీజేపీ పంచన చేరి అత్యంత అవినీతిపరుడుగా మారారన్నారు. ఆ ఎన్నికలలో అశోక్ తరపున తాను ప్రచారం చేశానని చాలా మంది అశోక్ ప్రచారంనకు రావద్దని వారించిన తాను వచ్చి గెలుపులో కీలక పాత్ర పోషించానన్నారు. ఈసారి అశోక్ పోటీ చేస్తే అతని ఓటమికి ప్రచారం చేస్తానని నారాయణ పేర్కొన్నారు



## నిర్మాతగా నిత్యా మీనన్ కొత్త ప్రయాణం.. అఫీషియల్‌గా ప్రకటించిన పవన్ హీరోయిన్

ప్రముఖ నటి, జాతీయ అవార్డు గ్రహీత నిత్యా మీనన్ తన సినీ ప్రయాణంలో మరో కీలక మైలురాయిని చేరుకున్నారు. నటిగా ఇప్పటికే విభిన్న పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు నిర్మాతగా కొత్త అవతారం ఎత్తుతున్నారు. 'కేయూరి ప్రొడక్షన్స్' (ఖవఎబతీఱ ూతీశీసబషఱశీఅం ) పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభిస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియోలో తన నిర్మాణ సంస్థ లక్ష్యాలు, దృక్పథం గురించి నిత్యా మీనన్ స్పష్టత ఇచ్చారు. కేవలం వాణిజ్య పరమైన సినిమాలకే పరిమితం కాకుండా, బలమైన కథా నేపథ్యం ఉన్న చిత్రాలు, లోతైన భావోద్వేగాలను కలిగించే పాత్రలు, సమాజంపై ప్రభావం చూపగల కథాంశాలకే తన బ్యానర్ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సినిమా అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, అది ప్రేక్షకులతో ఒక భావోద్వేగ బంధాన్ని ఏర్పరచే శక్తి కలిగిన మాధ్యమమని ఆమె అభిప్రాయపడ్డారు. గత ఏడాది వరుసగా మూడు విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన నిత్యా, ఇప్పుడు నిర్మాతగా కూడా తన ముద్ర వేయాలని సంకల్పించుకున్నారు. ప్రస్తుతం ఈ బ్యానర్ కింద ఎలాంటి ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించకపోయినా, ముందుగా తనకు ఉన్న నటనా కమిట్‌మెంట్‌లను పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు. నటిగా కొనసాగుతూనే, అభిరుచి గల నిర్మాతగా కూడా బాధ్యతలు నిర్వహించనున్నారు. విభిన్న కథలను ఎంచుకోవడంలో, ప్రయోగాత్మక పాత్రలను పోషించడంలో నిత్యా మీనన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇదే ధోరణిని నిర్మాతగా కూడా కొనసాగిస్తారని, కొత్త తరహా కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తారని చిత్ర పరిశ్రమ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఆమె ప్రారంభించిన ఈ కొత్త నిర్మాణ సంస్థ భవిష్యత్తులో కంటెంట్ ఆధారిత, నాణ్యమైన సినిమాలకు వేదికగా మారే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## అవకాశాల్ని సృష్టించుకున్నా!

కెరీర్ తొలినాళ్లలో అవకాశాల కోసం ఎంతో శ్రమించానని, దర్శకుల దగ్గరకు వెళ్లి తనకు సూటయ్యే పాత్ర ఉంటే ఇవ్వమని అడిగిన సందర్భాలెన్నో ఉన్నాయని గుర్తు చేసుకుంది అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం ఈ భామ దక్షిణాదితో పాటు హిందీలో కూడా సత్తా చాటుతున్నది. 2019లో 'సూపర్30'తో హిందీలో కథానాయికగా అరంగేట్రం చేసిన ఈ సొగసరి ప్రస్తుతం బాలీవుడ్‌లో మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్నది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో కెరీర్ తొలినాటి రోజుల్ని గుర్తు చేసుకుంది మృణాల్ ఠాకూర్. 'అవకాశాలు నా దగ్గరకు ఎప్పుడూ రాలేదు. వాటిని నేను సృష్టించుకున్నాను. దర్శకుల దగ్గరకు నేరుగా వెళ్లి మంచి పాత్ర కోసం అభ్యర్థించిన రోజులున్నాయి.

నటనంటే అమితమైన ప్రేమ కాబట్టి ఎలాంటి సంకోచం లేకుండా అవకాశాల కోసం అడిగేదాన్ని' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. శ్రీదేవి నటించిన 'మామ్' సినిమా తనను ఎంతగానో ఆకట్టుకుందని, దర్శకుడు రవి ఉద్యవార్‌ని కలిసి అలాంటి సీరియస్ కథ ఉంటే తనను పరిగణనలోకి తీసుకోమని కోరానని మృణాల్ తెలిపింది. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో హిందీలో 'దో దివానే సెహర్ మే' అనే చిత్రంలో నటించడం సంతోషంగా ఉందని చెప్పింది. అడివి శేష్‌తో మృణాల్ నటించిన 'డెకాయిట్' సినిమా పానిండియా స్థాయిలో త్వరలోనే విడుదల కానుంది.

## మరకతమణి 2 మొదలైంది



2017లో విడుదలైన 'మరకతమణి' చిత్రానికి సీక్వెల్‌గా 'మరకతమణి 2' చిత్రం రూపొందుతున్నది. ఆది పినిశెట్టి, సత్యరాజ్, ప్రియా భవాని శంకర్ , నిక్కీ గల్రానీ పినిశెట్టి ప్రధానపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఆర్కే శరవణన్ దర్శకుడు. సుధన్ సుందరం, మనీష్ సింఘాల్, దుర్గారం చౌదరి, దేవ్, కేవీ దురై నిర్మాతలు. ఈ సినిమా షూటింగ్ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సోమవారం చెన్నైలో పూజాకార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో కార్తీ క్లాప్ ఇవ్వగా, హీరో ఆర్య, దర్శకుడు వెంకట్‌ప్రభు 'కెమెరా.. రోలింగ్.. యాక్షన్' అంటూ షూటింగ్‌ను ప్రారంభించారు. నిరవధికంగా చిత్రీకరణ జరుగుతుందని, త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలు రివీల్ చేస్తామని మేకర్స్ తెలిపారు. మునిష్కాంత్, ఆనందరాజ్, డానీ, అరుణ్‌రాజా కామరాజ్, మురుగానందం తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పీవీ శంకర్, సంగీతం: ధిబు నినాన్ థామస్, నిర్మాణం: ప్యాషన్ స్టూడియోస్, దంగల్ టీవీ, ఆర్‌డిసి మీడియా, యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, గుడ్ షో సంస్థలు.

## అది నా అదృష్టం



'చిన్నప్పట్నుంచీ బిజినెస్ చేయాలని ఆలోచించే యువకుడు నాన్న బిజినెస్‌ని టేకప్ చేయాలని అనుకుంటాడు. అప్పుడు అతనికి ఎదురైన పరిస్థితు లేంటి? అసలు నాన్న బిజినెస్ ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా. ఈ సమాధానాలు ఆసక్తిగా ఉంటాయి. కథ, ఇందులోని పాత్రలు పూర్తి వినోదాత్మకంగా సాగుతాయి' అని సుహాస్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'హే బలవంత్'. శివాని నగరం కథానాయిక. గోపీ అచ్చర దర్శకుడు. బి.నరేంద్రరెడ్డి నిర్మాత. బన్నీవాస్, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సుహాస్ మంగళవారం విలేకరులతో ముచ్చటించారు. 'నా కెరీర్‌లో త్వరగా పూర్తయి, విడుదల అవుతున్న సినిమా ఇదే. ఈ కథ వినగానే ఇందులోని ఎంటర్‌టైన్‌మెంట్‌కీ, ఎమోషన్‌కీ కనెక్టయిపోయాను. అనుకున్నదానికంటే సినిమా వందరెట్లు బాగా వచ్చింది. ఈ మధ్య నా సినిమాలు కొన్ని అనుకున్న స్థాయిలో ఆడలేదు. అందుకే కాస్త బ్రేక్ తీసుకొని ఈ సినిమా చేశాను. చాలామంది నా సక్సెస్‌ను కోరుకుంటున్నారు. మంచి హిట్ రావాలని ఆశిస్తున్నారు. అలాంటి వ్యక్తులు ఉండటం నా అదృష్టం' అన్నారు సుహాస్. కెరీర్ విషయంలో పూర్తి సంతృప్తిగా ఉన్నానని, 'హే బలవంత్' రూపంలో పెద్ద విజయం తమ టీమ్‌కి రాబోతున్నదని, అందరికీ పేరు తెచ్చే సినిమా ఇదని సుహాస్ నమ్మకం వెలిబుచ్చారు. 'తన అసోసియేట్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ.. తమిళ అగ్ర దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు నిర్మిస్తున్న చిత్రంలో మెయిన్ విలన్‌గా నటిస్తున్నాను. ఇది చాలా గొప్ప సబ్జెక్ట్. నాది ఇందులో అత్యంత క్రూరమైనే పాత్ర. పైగా ఏజ్డ్ కేరక్టర్. నా లుక్ కూడా కొత్తగా ఉంటుంది.' అని తెలిపారు సుహాస్.

## వారణాసిలో శివ భక్తుడిగా..



'వారణాసి' చిత్రంలో తాను పరమ శివ భక్తుడి పాత్రలో నటిస్తున్నానని ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్ తెలిపారు. తాజా ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటికే ఈ సినిమా తాలూకు కీలక షెడ్యూల్స్‌లో తాను భాగమయ్యానని ఆయన చెప్పారు. మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'వారణాసి' ప్రస్తుతం జార్జియాలో చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ సినిమాలో ప్రకాష్‌రాజ్ పాత్ర గురించి సోషల్‌మీడియాలో అనేక వార్తలు ప్రచారమవుతున్నాయి. తాజాగా వీటిపై ప్రకాష్‌రాజ్ స్పష్టతనిచ్చారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సినిమాలో మహేష్‌బాబు తండ్రి పాత్రలో ప్రకాష్‌రాజ్ కనిపిస్తారని, కథాగమనంలో ఆయన పాత్రకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని చెబుతున్నారు. భారతీయ పురాణాల నేపథ్యంలో సాహసగాథగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మహేష్‌బాబు రుద్ర పాత్రను పోషిస్తున్నారు. రామాయణ నేపథ్యంలో సాగే ఓ ఎపిసోడ్‌లో మహేష్‌బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదలకానుంది.

## నిజాయతీగా చేసిన ప్రయత్నం



సౌమిత్ పొలాడి హీరోగా నటిస్తూ సాయి కె.వెన్నంతో కలిసి దర్శకత్వంలో వహించిన యువతరం ప్రేమకథ 'నిలవే'. సౌమిత్ పొలాడికి జోడీగా శేయాసి సేస్ నటించగా, హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటించారు. రాజ్ అల్లాడ, గిరిధర్‌రావు పొలాడి, సాయి కె.వెన్నెం నిర్మాతలు. ఈ నెల 13న వాలెంటైన్స్ డే కానుకగా విడుదలైన ఈ సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్‌ని మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. దమూడేళ్ల కష్టం ఈ సినిమా అనీ, నిజాయతీగా చేసిన ప్రయత్నం ఫలించిందని, థియేటర్లలో ప్రేక్షకుల స్పందన చాలా సంతోషాన్ని ఇచ్చిందని, ఇది జెన్యూన్ హిట్ అనీ హీరో సౌమిత్ పొలాడి నమ్మకంగా చెప్పారు. ఈ విజయం తమ టీమ్ అందరిదీ అని నిర్మాత రాజ్ అల్లాడ అన్నారు. మన ఆలోచన పవిత్రంగా ఉంటే అన్నీ నెరవేరుతాయని ఈ సినిమా విజయం తెలియజేసిందని, సంకల్పం గట్టిగా ఉండబట్టే ఇక్కడ దాకా వచ్చామని దర్శకుడు అభిప్రాయపడ్డారు.

## సత్యదేవ్ కొత్త సినిమా షురూ.. క్లాప్ కొట్టిన అనిల్ రావిపూడి..!




యువ నటుడు సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న 15వ చిత్రం బుధవారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో వైభవంగా ప్రారంభమైంది. లక్ష్మీనారాయణ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని త్రిషూల్ విజినరీ స్టూడియోస్ పతాకంపై నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సత్యదేవ్‌కు జోడీగా 'జాతిరత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా నటిస్తుండగా, ప్రముఖ గాయకుడు రామ్ మిర్యాల ఈ సినిమాతో పూర్తిస్థాయి సంగీత దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుకకు సినీ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టగా, నిర్మాత వంశీ నందిపాటి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. స్నేహం నేపథ్యంలో సాగే పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం 'రావుబహదూర్', 'గరుడ చాప్టర్-1' వంటి వైవిధ్యమైన సినిమాలతో బిజీగా ఉన్న సత్యదేవ్, ఈ కొత్త ప్రాజెక్టుతో మరో ఆసక్తికరమైన జోనర్‌లో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.

# నైతికంగా గెలుపు నారాయణదే?

- అసలు 5 వ వార్డులో ఏం జరిగింది..? - ఒంటరిగా పోరాటం చేసిన నారాయణ...
- గెలుపుకు దగ్గరగా... తృటిలో ఓటమి... - సహకరించని అధిష్టానం ..
- అక్కడ డబ్బే.... పని చేసింది... - బోయిని నారాయణకు ప్రజల మద్దతు...



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మున్సిపల్ ఎన్నికల్లో 5వ వార్డు నుండి బరిలో నిలుచున్న బీజేపీ అభ్యర్థి బోయిని నారాయణ తృటిలో ఓడి పోయాడు.ముందు నుండి 5 వార్డులో బీజేపీ అభ్యర్థి బోయిని నారాయణ బారీ మెజారిటీ దిశగా గెలుస్తాడని వార్డుతో పాటు మంథని మున్సిపల్ లో ముందు నుండి ప్రచారంలో ఉంది. అయితే గతంలో వార్డ్ మెంబర్, ఎంపీటీసీగా ఓడిపోయిన నారాయణ కు ఈ సారి స్థానిక వార్డులో ప్రజల నుండి గట్టి సానుభూతి వచ్చింది. మొదట నుండి చివరి వరకు ఒంటరి పోరాటంతో నారాయణ ప్రజల ఆశీర్వాదంతో గెలుపు దిశగా ముందుకు వెళ్ళాడు.ఓట్ల లెక్కింపులో తన ప్రత్యర్థి పై దాదాపు 27 ఓట్లతో తృటిలో ఓటమి చెందాడు. ముందు నుండి నారాయణ దే గెలుపు అని లెక్కింపు పూర్తి అయ్యే వరకు అందరూ భావించిన కూడా గెలుపుకు దగ్గరలో ఓడిపోయాడు. మున్సిపల్ లో ముందు నుండి నారాయణ దే హవా కొనసాగింది. నారాయణ గెలుస్తాడని మున్సిపల్ లో ప్రచారం లో ఉన్న బీజేపీ అధిష్టానముకు సంకేతాలు వెళ్లిన నారాయణ కొరకు గట్టి ప్రయత్నాలు ఎందుకు చేయలేదని స్థానికుల నుండి పలు అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే నారాయణ ను ఓడించడానికి... డబ్బులు బాగా ఖర్చు చేసినట్లు స్థానికంగా రాజకీయ నాయకులు ప్రజలు చర్చించుకుంటున్నారు.నైతికంగా గెలుపు ఆయనదేనని బోయిని నారాయణ సామాన్యుడు గానే అక్కడ పోటీ చేసినప్పటికీ అక్కడ డబ్బే.... పని చేసిందనీ రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పలువురు.బోయిని నారాయణకు స్థానిక ప్రజలు మద్దతుగా పలు ప్రశంసలు కూడా వస్తున్నాయి.

## ప్రేమ పెళ్లి తర్వాత కట్న వేధింపులు...

# వివాహిత ఆత్మహత్య

- కరీంనగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : నిరంజన్ రెడ్డి



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** కట్నం వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీంనగర్ జిల్లాలో జరిగింది. ఈ నేపథ్యంలో కరీంనగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి : మంచిర్యాల జిల్లా గొల్లపల్లికి చెందిన మమత (29) ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త నరేష్, అత్తింటి వారు పెళ్లి తర్వాత నుంచే కట్నం కోసం వేధిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు రూ.లక్ష ఇచ్చినా హింస ఆగలేదని,భర్త అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండగా కూడా ఆమెను నిందిస్తూ మానసిక ఒత్తిడి తేవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మమత తీగలగుట్టపల్లి వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుందని, మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్తింటి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

## కిష్టాపూర్ గ్రామంలో ఘనంగాకెసిఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించిన కిష్టాపూర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలోతెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు. ఘనంగా నిర్వహించిన కేక్ కట్ చేసి డీజే సప్పులతో నృత్యాలతో అందర్నీ ఆకట్టుకునే విధంగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత గౌరవ కేసీఆర్ 72వ జన్మదిన వేడుకలు మంగళవారం బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నాగుల గారి సుధాకర్ గౌడ్ మాజీ అధ్యక్షులు అక్కే రవి మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నాయకులు కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేసి కెసిఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరంపార్టీ శ్రేణులు ఒకరికొకరు కేకు తినిపించుకున్నారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం అనేక కష్టాలు నోచుకుని కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి చావు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ప్రజల కల నెరవేరించింది కెసిఆర్ అని అన్నారు.10 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తెలంగాణను 29వ రాష్ట్రం నుండి నెంబర్ వన్ స్థాయికి తెచ్చిన ఘనత కేసిఆర్ దే అని పేర్కొన్నారు. కిష్టాపూర్ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తరఫున కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కెసిఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని ప్రార్థించారు. రాబోయే కాలంలో తెలంగాణలో తప్పకుండా మళ్లీ ముఖ్యమంత్రిగా కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కెసిఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని,మనో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ శేరిపల్లి ప్రశాంత్, వరిగుంతం నాగరాజు, పుట్నాల లడ్డు, టి చిన్న, సంజీవ్, గణేష్ యాదవ్, లింగం, ఎండి అస్లాం, నకిర్త రాము, చాకలి సాయి, పసుల మల్లేశం, పెద్దట్ల మల్లేశం, ఎండి చాంద్ పాషా, కిష్టాపూర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## దళిత మహిళా ప్రతినిధిపై అనుచిత

# వ్యవహారం అప్రజాస్వామికం

- బాధ్యులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి
- కరుణాకర్ రెడ్డి, మారబోయిన పాండుల కౌన్సిలర్ పదవులను రద్దు చేయాలి
- దళిత సంఘాల రాష్ట్ర నేత,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు : బండపల్లి అంజన్ కుమార్



**కొడిమ్యాల (ప్రశ్న న్యూస్)** జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నికల ఓటింగ్ సందర్భంగా దళిత మహిళా కౌన్సిలర్‌పై అనుచితంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల రాష్ట్ర నేత, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సాయి హర్షిణి ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ బండపల్లి అంజన్ కుమార్ డిమాండ్ చేశారు.ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచిన దళిత మహిళా కౌన్సిలర్ మంజుల బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్న తరుణంలో ఆమెను ఓటు వేయకుండా బెదిరింపులకు గురి చేయడంతో పాటు, ఓటింగ్ సమయంలో బీఆర్ఎస్ పార్టీ చైర్మన్ అభ్యర్థికి చేతుఎత్తి మద్దతు తెలుపుతుండగా ఆమె భుజం, చేతిని కిందికి లాగుతూ అవమానకరంగా ప్రవర్తించారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనలో కరుణాకర్ రెడ్డి,మారబోయిన పాండు పాత్ర ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బండపల్లి అంజన్ కుమార్ మాట్లాడుతూ "దళిత మహిళా ప్రజాప్రతినిధిపై ఇలా దౌర్జన్యంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి మాత్రమే కాదు, దళిత సమాజ గౌరవాన్ని అవమానపరచడమే. వెంటనే సంబంధిత బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి" అని డిమాండ్ చేశారు.అదేవిధంగా దళిత మహిళా కౌన్సిలర్ పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారి కౌన్సిలర్ పదవులను రద్దు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలంటే ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తప్పనిసరి అని బండపల్లి అంజన్ కుమార్ స్పష్టం చేశారు.

## అల్లాను ఆరాధిస్తూ మీరు చేసే ఉపవాస దీక్ష తో అన్నింటా, అందరికి మంచి జరగాలి

- పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్ శుభాకాంక్షలు తెలిపారు.రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని పేర్కొన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులంతా నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలతో నిష్టగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారని అన్నారు. అల్లా రక్షణ, కరుణ పొందాలనే లక్ష్యంతో రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తు ప్రతి ఒక్కరూ ఉన్నదానిలో ఎంతోకొంత దానధర్మాలు చేస్తారని అన్నారు. సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవడం ఎంత సంతోషంగా ఉంటుంది అని అన్నారు. ఈ మాసంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

- అదనపు కలెక్టర్ నగేష్




**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళాశిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో 'బాల్య వివాహము భారత్ 1- 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం'లో భాగంగా మంగళవారం జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి తో కలిసి ప్రత్యేక ప్రచార వాహనాన్ని జెండా ఊపి అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వాహనంలోని మైక్ సదుపాయంతో గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తామన్నారు. బాల్యం ఎంతో విలువైన దశ అని, బాలబాలికలకు విద్య, ఆరోగ్యం, రక్షణ హక్కులు కల్పించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. బాల్య వివాహాల వివరాలు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా చేయడంలో అందరూ బాధ్యత వహించాలని చెప్పారు.జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి మాట్లాడుతూ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, గ్రామసభలు, ఆశ్రమ పాఠశాలలు, గిరిజన తండాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శాఖ అధికారినీ హేమ భార్గవి, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు,జిల్లా బాలల సంరక్షణ అధికారి నాగరాజు, మహిళా శక్తి కేంద్ర కోఆర్డినేటర్ సంతోషి, విజన్ సంస్థ డైరెక్టర్ కైలాష్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు రాజు, శరత్ మరియు సిబ్బంది సంజీవ్, నవనీత పాల్గొన్నారు అదేవిధంగా జిల్లా బాలల సంరక్షణ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం ఆరోపణలు - ఏఎన్ఎం పై ఫిర్యాదు

- టీకా కోసం వెళ్లిన బాలింతకు అవమానం - ఏఎన్ఎం పై డిఎంహెచ్ఓ కు ఫిర్యాదు




**బోయినిపల్లి ( ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, కొదురుపాక సబ్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం లక్ష్మిపై అదే గ్రామానికి చెందిన మైలారం లాస్య జిల్లా వైద్య ఆరోగ్యాధికారికి ఫిర్యాదు చేశారు.లాస్య తెలిపిన వివరాల ప్రకారం--- గత నెల జనవరి 4న ఆమె ప్రసవం కోసం వేములవాడ --తిప్పాపూర్ ఏరియా ఆసుపత్రికి వెళ్లగా, ఆశా వర్కర్ కూడా వెంట ఉన్నారు. ఆదివారం కావడంతో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సుమారు నాలుగు గంటలు వేచి చూసిన తర్వాత పరిస్థితుల దృష్ట్యా ప్రైవేట్ ఆసుపత్రిలో డెలివరీ చేయించుకున్నట్లు తెలిపారు.తర్వాత పుట్టిన శిశువుకు టీకా వేయించేందుకు కొదురుపాక సబ్ సెంటర్‌కు వెళ్లగా ఏఎన్ఎం లక్ష్మి టీకా వేయనని చెప్పి బయటకు వెళ్లమని పరుష పదజాలంతో మాట్లాడినట్లు ఆరోపించారు. టీకా వేయమని బ్రతిమిలాడగా చివరకు టీకా వేశారని, బాలింత అని కూడా చూడకుండా దుర్భాషలాడారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు లాస్య తెలిపారు.

# కులం పేరుతో మహిళను దూషించిన ఘటనలో నిందితుల రిమాండ్

- మెదక్ డియస్పి డి. ప్రసన్నకుమార్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రాజకీయ మద్దతు విషయంలో ఏర్పడిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కులం పేరుతో మహిళను దూషించడమే కాకుండా, ఎమ్మెల్యే వాహనంపై రాళ్లతో దాడి చేసి చంపాలనే ప్రయత్నం చెసిన ఘటనకు సంబంధించి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు మెదక్ డియస్పి డి. ప్రసన్నకుమార్ తెలిపారు.మెదక్ డియస్పి డి. ప్రసన్నకుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ మహిళ కార్యకర్త మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో 15వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి భర్త మల్లికార్జున్ గౌడ్ మరియు అతని అనుచరులు ఆమెను బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అయితే ఆమె ఇందుకు నిరాకరించడంతో, 09-02-2026 తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో మల్లిఖర్జున్ గౌడ్ ఆమెను కులం పేరుతో దూషిస్తూ బూతు మాటలు మాట్లాడినట్లు ఫిర్యాదు అందినట్లు తెలిపారు.ఈ ఘటన విషయమై బాధితురాలు స్థానిక ఎమ్మెల్యే కి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆమెను పరామర్శించేందుకు బయలుదేరిన సమయంలో, పిట్లం బేస్ చెరువు కట్ట వద్ద బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు మల్లిఖర్జున్ గౌడ్, జీవన్ రావు, వేణు, హబీబ్, మల్లేష్ తదితరులు కలిపి మొత్తం 23 మంది కలిసి ఎమ్మెల్యే వాహనంపై రాళ్లతో దాడి చేసి చంపాలనే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో వాహనానికి నష్టం వాటిల్లడంతో పాటు ఎమ్మెల్యే గకి మరియు ఆయన అనుచరులకు గాయాలు అయినట్లు పేర్కొన్నారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఓ మహిళపై మల్లికార్జున్ గౌడ్ ఛాతిపై చేయి వేసి తోసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గోదాల అఖిలను కులం పేరుతో దూషించిన ఘటనపై సంబంధిత సెక్షన్లతో పాటు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డియస్పి తెలిపారు. ఈ కేసులో కొందరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

## తలశిల చంద్రశేఖర్ రావు భౌతికకాయానికి నివాళులర్పించిన: మొండితోక అరుణ్ కుమార్



విజయవాడ (ప్రశ్న న్యూస్)వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తండ్రి తలశిల చంద్రశేఖర్ రావు (88) మరణం పట్ల ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ గొల్లపూడిలోని తలశిల రఘురామ్ నివాసానికి వెళ్లి చంద్రశేఖర్ రావు భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. చంద్రశేఖర్ రావు మరణం తలశిల రఘురామ్ కి, కుటుంబ సభ్యులకు తీరని లోటని తెలిపారు.ఈ దుఃఖ సమయంలో తలశిల రఘురామ్ కి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, చంద్రశేఖర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నానని డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ తెలిపారు.

## ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ సభ్యులను సన్మానించిన మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్

- ప్రెస్ క్లబ్ చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఈటల రాజేందర్



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్ )** ఉప్పల్ (ప్రింట్ ఽ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ) నూతన కమిటీ సభ్యులు మేడ్చల్--మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్ నాయకత్వంలో జరిగిన ఈ భేటీలో ఎంపీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 సంవత్సరాల తర్వాత ఉప్పల్ లో సీనియర్ జర్నలిస్టు వడ్డేపల్లి కిషోర్ నాయకత్వంలో మొదటిసారిగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఐకమత్యంతో, స్నేహబంధంతో నూతన కమిటీ కూడా సమర్థంగా పనిచేయాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో కమిటీకి ఎలాంటి అవసరాలు ఉన్నా ప్రభుత్వం నుంచి కావాల్సిన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మీడియా నిష్పక్షపాత ధోరణితో పనిచేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంలో మీడియా ముందుండాలని పేర్కొన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ బీజేపీ అధ్యక్షుడు మారినేని ఫణిందర్ , ఉప్పల్ ప్రధాన కార్యదర్శి తీగ విట్టల్ రావు, కోశాధికారి దువ్వాళ రమేష్ ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నెక్స్ట్ జనరేషన్ లీడర్స్‌లో రేవంత్ టాప్

## - మున్సిపల్ ఫలితాలతో అంతా మారిపోయిందా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికలు రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఒక యాసిడ్ టెస్ట్‌గా నిలిచాయి. ప్రభుత్వ వ్యతిరేకత పేరుతో జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 80 శాతానికి పైగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయడం రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహ చతురతకు నిదర్శనంగా మారింది. ముఖ్యంగా పట్టణ ఓటర్లు కూడా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం, గతంలో కేవలం గ్రామీణ పార్టీగా ఉన్న ముద్రను రేవంత్ చెరిపివేయగలిగారు. ఈ విజయంతో ఆయన హైకమాండ్ వద్ద తన పరపతిని అమాంతం పెంచుకున్నారు.

### నేనే రాజు.. నేనే మంత్రి

ఢిల్లీ వేదికగా రేవంత్ రెడ్డి చేసిన నేనే రాజు.. నేనే మంత్రి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. అయితే, దీనిపై ఆయన తర్వాత కాలంలో స్పష్టత ఇచ్చారు. తాను ముఖ్యమంత్రిగా ఉండటంతో పాటు, మున్సిపల్ పరిపాలన శాఖను కూడా తానే పర్యవేక్షిస్తున్నందున, ఈ ఎన్నికల గెలుపోటములకు తానే పూర్తి బాధ్యత వహిస్తాననే ఉద్దేశంతో ఆ మాట అన్నట్లు వివరించారు. ఒక సేవకుడిగానే తాను బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని చెబుతూనే, బాధ్యతను భుజానికెత్తుకునే విషయంలో తనకున్న తెగింపును ఈ వ్యాఖ్యల ద్వారా చాటారు.

### కాంగ్రెస్‌లో రేవంత్ వ్యతిరేక వర్గం లేదు

కాంగ్రెస్ పార్టీలో సహజంగా ఉండే గ్రూపు రాజకీయాలు రేవంత్ రెడ్డి విషయంలో ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. పార్టీలో ఆలస్యంగా చేరినప్పటికీ, సీనియర్లను సమన్వయం చేసుకుంటూనే, తన నిర్ణయాలే ఫైనల్ అనే స్థాయికి ఆయన ఎదిగారు. గతంలో బహిరంగంగా విమర్శలు చేసిన నాయకులు కూడా ఇప్పుడు మౌనం వహించడం. రేవంత్ నాయకత్వాన్ని సమర్థించడం ఆయన సాధించిన అతిపెద్ద రాజకీయ విజయం. హైకమాండ్ పూర్తి మద్దతు ఉండటంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో రేవంత్ ఇప్పుడు ఒక్కడే మొనగాడు గా కనిపిస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యతిరేక కామెంట్లు చేస్తున్నా ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదు.

### జాతీయ స్థాయిలో తదుపరి తరం నేతగా రేవంత్

మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నెక్స్ట్ జనరేషన్ లీడర్‌గా గుర్తింపు పొందుతున్నారు. హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అనర్గళంగా మాట్లాడుతూ జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించడమే కాకుండా, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో పార్టీకి స్టార్ క్యాంపెయినర్‌గా మారుతున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల నమ్మకాన్ని చూరగొనడంలో ఆయన సఫలీకృతులయ్యారు.

### రాష్ట్రంలో తిరుగులేని పట్టు

వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలు సాధించడంతో తెలంగాణలో రేవంత్ రెడ్డికి ఎదురులేకుండా పోయింది. అటు విపక్ష బీఆర్ఎస్ బలహీనపడటం, ఇటు బీజేపీ పట్టణ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో పుంజుకోకపోవడం రేవంత్‌కు కలిసొచ్చింది. తన సంక్షేమ పథకాలు, దూకుడుగా ఉండే రాజకీయ శైలితో రేవంత్ రెడ్డి తెలంగాణ రాజకీయ యవనికపై ఒక బలమైన ముద్ర వేశారు. ఇది రేవంత్ నాయకత్వ పరంగా పంజుకోవడానికి కలసి వచ్చింది.

# బెడిసి కొట్టిన వ్యూహం

## - పురపోరులో బీజేపీ వైఫల్యానికి అసలు రీజన్ ఇదేనా.?



**హైదరాబాదు (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు భారతీయ జనతా పార్టీకి ఇబ్బందికరంగా మారింది. బీఆర్ఎస్ కు కేవలం పదిహేను శాతం ఓట్లు మాత్రమే లభించాయి. అయితే నేతల మధ్య సమన్వయం లేమి ఈ మున్సిపల్ ఎన్నికల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. సాధారణంగా బీజేపీలో గ్రూపులుండవు. కానీ తెలంగాణ బీజేపీలో మాత్రం నేతలు గ్రూపులుగా విడిపోయి పార్టీకి ఇబ్బంది కరంగా మారారన్న విమర్శలు సొంత పార్టీ నుంచి వినిపిస్తున్నాయి. పార్టీ కేంద్ర నాయకత్వం కూడా ఈ గ్రూపు రాజకీయాలను గత కొన్నాళ్లుగా గమనిస్తుంది. అనేక సార్లు హెచ్చరికలు జారీ చేసినా ఫలితం కనిపించడం లేదని అర్థమై ఇక "ఆపరేషన్ కమలం" కు సిద్ధమయిందన్నది ఢిల్లీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. మరొకవైపు జనసేన పార్టీతో పొత్తు అని ప్రకటించడం కూడా ఫలితాలపై ప్రభావం చూపిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

### బలంగా ఉండాల్సిన సమయంలో..

శాసనసభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను గెలుచుకున్న తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది నియోజకవర్గాల్లో విజయం సాధించింది. అంటే దాదాపు యాభైకి పైగా నియోజకవర్గాల్లో బీజేపీ బలంగా ఉండాల్సి ఉంది. కానీ మున్సిపల్ ఎన్నికల ఫలితాలను చూస్తే మాత్రం అలా కనిపించడం లేదు. ఎనిమిది పార్లమెంటు స్థానాలను గెలిచిన పార్టీయేనా.? ఇది అన్న అనుమానం ఎవరికైనా కలుగుతుంది. రాష్ట్రంలో అధికారానికి ప్రత్యామ్నాయం తామే అని గట్టిగా వినిపించే బీజేపీ నేతల మాటలకు, క్షేత్రస్థాయిలో వస్తున్న ఫలితాలకు మధ్య పొంతన లేకపోవడం ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో డబుల్ డిజిట్ సీట్లు సాధించే సత్తా ఉన్న పార్టీ, స్థానిక సంస్థల ఎన్నికలకు వచ్చేసరికి కేవలం ఓట్ల శాతం పెంచుకోవడానికే పరిమితమవ్వడానికి కారణం వ్యూహాత్మక లోపాలేనన్నది పార్టీ సీనియర్ నేతల అంచనాగా ఉంది. కరీంనగర్ కార్పొరేషన్ చేతికి అందడం స్వల్ప ఊరట. మున్సిపల్ ఎన్నికల్లో 261 వార్డుల్లో మాత్రమే బీజేపీ విజయం సాధించింది. ఏడు కార్పొరేషన్లలో 77 డివిజన్లలో గెలిచింది. కరీంనగర్, నిజామాబాద్ లోనే కొంత అనుకూల ఫలితాలు వచ్చాయి.

### ఇన్ని గ్రూపులా.?

పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ఇమేజ్ , జాతీయ అంశాల మీద బీజేపీ గెలుపు గుర్రం ఎక్కగలిగింది. కానీ, మున్సిపల్ ఎన్నికల విషయానికి వచ్చేసరికి స్థానిక సమస్యలు, అభ్యర్థుల బలం , క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ ముఖ్యం. ఇక్కడే బీజేపీ విఫలమవుతోంది. అవకాశం ఉన్నప్పుడు స్థానిక కమిటీలను బలోపేతం చేసుకోవడంలో, ప్రజలతో మమేకమవ్వడంలో పార్టీ నేతలు విఫలమవుతున్నారు. ఫలితంగా ఓట్ల శాతం పెరిగినప్పటికీ, అది గెలుపు సాధించేందుకు అవసరమైన స్థానాలను మాత్రం సాధించలేదు. ఇది వ్యూహాత్మక తప్పిదమేనని అంటున్నారు. అంతర్గత కలహాలు పార్టీని ఇబ్బంది పెడుతున్నాయి. పార్టీలో ఎన్ని గ్రూపులు ఉన్నాయో లెక్కగట్టడం కష్టమన్న విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. సీనియర్లకు, కొత్తగా చేరిన వారికి మధ్య సమన్వయం లేకపోవడం, ఎవరికి వారు తామే పవర్‌ఫుల్ అని చాటుకోవాలనే తపన పార్టీ ఎదుగుదలను దెబ్బతీస్తోంది. ఈ గ్రూపు తగాదాల వల్ల పార్టీ కేడర్ అయోమయానికి గురవుతోంది. ఇప్పటికైనా కేంద్ర నాయకత్వం చర్యలకు దిగితే తప్ప తెలంగాణ బీజేపీ వచ్చే శాసనసభ ఎన్నికలకు కోలుకోలేదు.

# కవాడిగూడ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎక్కడ.?

- సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యపై గుప్పుమంటున్న అవినీతి ఆరోపణలు
- రాజకీయ నాయకుల పేరుతో అవినీతి దందా.?
- సికింద్రాబాద్ ప్రాంతంలో విపరీతంగా పెరిగిపోతున్న అవినీతి "కిరణాలు"




**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ పరిధిలోని కవాడిగూడ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై నియంత్రణ పూర్తిగా సడలిపోయిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నల్లగుట్ట, రాంగోపాల్ పేట్ ప్రాంతంలో పక్కింటి నెంబర్ 2-4-65/68 వద్ద సెల్లార్‌తో పాటు అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తున్న భారీ కట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది.స్థానికుల ఆరోపణల ప్రకారం, ఈ నిర్మాణం నిబంధనలు పూర్తిగా ఉల్లంఘిస్తూ కొనసాగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ సెల్లార్, అక్రమ అంతస్తులతో నిర్మిస్తూ ఉంటే అధికారులు మౌనం వహించడం కారణం లంచాలేనా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### రాజకీయ పలుకుబడి అంటూ సాగుతున్న నిర్మాణం.?

సికింద్రాబాద్ ప్రాంతం అంటేనే ఆ నాయకుల పేరుతో అవినీతి అక్రమాలు జోరుగా సాగుతాయి. వాస్తవానికి వాళ్ల హస్తం ఉంటుందో లేదో తెలియదు కానీ వాళ్ల పేరు చెప్పుకొని ఇక్కడ అవినీతి దందా చేసే వాళ్ళు కుప్పలు తిప్పలుగా ఉంటారు వాళ్లకు అధికారులు కూడా సై అనడం విస్మయాన్ని కలిగిస్తుంది అధికారులు లంచాలు తీసుకొని స్థానిక నేతల పేరు చెప్పి కాలం గడుపుతుంటారు. నిర్మాణదారులు "రాజకీయ పలుకుబడి ఉంది" అనే పేరుతో అధికారులకు లంచాలు ఇచ్చే ప్రభావితం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా సెల్లార్ తవ్వకం, అదనపు అంతస్తుల నిర్మాణం జరుగుతున్నా చర్యలు లేకపోవడం చూస్తుంటే అదికారుల అవినీతిపై అనుమానాలకు తావిస్తోంది. ఫిర్యాదులు చేసినా అధికారులు కదలడం లేదు" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### జిహెచ్ఎంసి ఆదాయానికి గండి.?

మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు కోల్పోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అక్రమ నిర్మాణాలు పెరిగితే నగర ప్రణాళిక దెబ్బతినడమే కాకుండా భవిష్యత్తులో భద్రతా సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

### పాత బేగంపేట సర్కిల్‌లోనూ ఇదే పరిస్థితి.?

ప్రస్తుతం కేవలం కవాడిగూడ సర్కిల్ కాకుండా పాత బేగంపేట సర్కిల్ పరిధిలో కూడా ఇదే తరహా అక్రమ నిర్మాణాల దందా నడుస్తోందని సమాచారం. స్థానిక ప్రజా ప్రతినిధుల పేర్లు వినిపిస్తూ కొన్ని నిర్మాణదారులు నిబంధనలు పట్టించుకోవడం లేదని, అక్రమ సెల్లార్ అక్రమ అంతస్తులతో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణాలు చేస్తున్నారని స్థానికుల ఆరోపణలు వినిపిస్తున్నాయి.



### జిహెచ్ఎంసి ఉన్నతాధికారుల జోక్యం అవసరం

స్థానిక ప్రజలు, బాధితులు ఈ అంశంపై వెంటనే జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు నిర్మాణానికి ఉన్న అనుమతులు పరిశీలించాలనిఅక్రమంగా నిర్మించిన అంతస్తులపై చర్యలు తీసుకోవాలని సిబ్బంది, అధికారుల పాత్రపై విజిలెన్స్, ఏసీబీ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

### ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి...

కవాడిగూడ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ, జోనల్ కమిషనర్లు నిజంగా చర్యలు తీసుకుంటారా.?సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య అవినీతిపై వస్తున్న అనేక ఆరోపణలపై విచారణ జరుగుతుందా.? రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో జిహెచ్ఎంసి నిబంధనలు అమలవుతాయా.? లేక అక్రమాలకు మళ్లీ ముసుగేనా.? అంటూ స్థానికులు జిహెచ్ఎంసి కమిషనర్ ను ప్రశ్నిస్తున్నారు.

# మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

- విద్యార్థుల కిడ్నాప్ కేసులో మోహన్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ
- అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలన్న అభ్యర్థనను తోసిపుచ్చిన న్యాయస్థానం
- ప్రధాన నిందితుడితో కాల్స్, మెసేజ్‌లపై ఫోరెన్సిక్ రిపోర్ట్ రావాల్సి ఉందని వెల్లడి
- కేసు కొట్టివేత పిటిషన్‌పై విచారణను మార్చి 3వ తేదీకి వాయిదా



అమరావతి(ప్రశ్న న్యూస్) విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసులో ప్రముఖ సినీ నటుడు, మోహన్‌బాబు యూనివర్సిటీ చాన్స్‌లర్ మంచు మోహన్‌బాబుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో తనను అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. అరెస్ట్‌తో పాటు తదుపరి చర్యలు నిలుపుదల చేయాలన్న ఆయన అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ వ్యాజ్యంపై జస్టిస్ వెంకట జ్యోతిర్మయి విచారణ చేపట్టారు. కిడ్నాప్ ఘటనకు ముందు, ఆ తర్వాత కూడా కేసులో ప్రధాన నిందితుడైన యూనివర్సిటీ పీఆర్వో సతీశ్‌తో మోహన్‌బాబు ఫోన్‌లో మాట్లాడారని, మెసేజ్‌లు కూడా పంపుకున్నారని పోలీసుల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు

# ఏప్రిల్‌లో 4 రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు




న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్, అసోం, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మార్చిలో వీటికి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్నట్లు అధికారులు మంగళవారం తెలిపారు.ఏప్రిల్ నెలలో వివిధ తేదీల్లో వీటికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ రాష్ట్రాల అసెంబ్లీల గడువు మే, జూన్ నెలల్లో ముగియనుంది. ఎన్నికల సంఘం ఇప్పటికే ఈ రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు పర్యటనలు ప్రారంభించింది. పశ్చిమ బెంగాల్‌లో గత అసెంబ్లీ ఎన్నికలను 8 దశల్లో నిర్వహించారు. అసోంలో రెండు దశల్లో, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిల్లో ఒకే దశలో నిర్వహించారు. కాగా ఇప్పటికే పుదుచ్చేరిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ తర్వాత ఫిబ్రవరి 14న తుది జాబితాను ప్రకటించారు. తమిళనాడులో మంగళవారం, కేరళలో ఈ నెల 21న ప్రకటించనున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఫిబ్రవరి 28న ప్రచురించనున్నారు.

# బాల్క సుమన్ అరెస్ట్‌ను ఖండించిన హరీశ్ రావు

- కాంగ్రెస్ పార్టీ మురుగు రాజకీయాలు చేస్తోందన్న హరీశ్
- చట్టాలను తుంగలో తొక్కుతోందని విమర్శ
- చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో ఆక్రమించుకుంటున్నారని మండిపాటు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మురుగు రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ క్యాతనపల్లిలో బీఆర్ఎస్‌కి పూర్తి మెజారిటీ వచ్చినా కాంగ్రెస్ పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన తీరును యావత్ తెలంగాణ అసహ్యించుకుంటోందని అన్నారు. అధికార బలం, ధన బలంతో చట్టాలను కాంగ్రెస్ తుంగలో తొక్కుతోందని విమర్శించారు. పోలీసులు కూడా అధికార పార్టీకి పూర్తిగా సహకరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక చర్యలను అడ్డుకున్నందుకు దళిత నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామని హరీశ్ రావు పేర్కొన్నారు. "జనగాంలో దళిత మహిళా కౌన్సిలర్ బీఆర్ఎస్ కు మద్దతుగా చెయ్యి ఎత్తితే రిటర్నింగ్ ఆఫీసర్ సాక్షిగా కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు. అధికారులు, పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదు" అని ఆయన మండిపడ్డారు. క్యాతనపల్లి, తొర్రూరు, జనగాం, ఇబ్రహీంపట్నం, జహీరాబాద్ సహా హంగ్ వచ్చిన ప్రతి చోటా ప్రజా తీర్పును కాంగ్రెస్ గౌరవించలేదని దుయ్యబట్టారు. చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో దక్కించుకుంటున్నారని ఆరోపించారు. భూములను కబ్జా చేసినట్లే, రాజకీయ పీఠాలను కూడా కబ్జా చేస్తున్నారని విమర్శించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588